

నేడు బౌద్ధరామాల్లో యోగాంధ్ర

ఏలూరు/కామవరపుకోట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పర్యాటకశాఖ ఆధ్వర్యంలో కామవరపుకోట మండలం జీలకర్రగూడెం, గుంటుపల్లి బౌద్ధరామాల వద్ద బుధవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లతో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. యోగాసన శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వివిధ లోకేషన్లలో ప్రతీ రోజు నిర్వహించే యోగా కార్యక్రమాలు ఫోటోలు, అభ్యాసకుల హాజరు, డేటా, అభ్యాసన కార్యక్రమం పూర్తి అయిన వెంటనే అప్‌డేట్ చేయాలన్నారు. యోగాంధ్రలో భాగస్వామ్యం అయ్యేందుకు జిల్లాలో ఇంతవరకు 8,60,072 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు.

రైతులకు శుభవార్త

ఆధార్ ఓటీపీతోనే ఈకేవైసీ

ఏలూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజనలో రైతులకు బయోమెట్రిక్ అవసరం లేదని, ఆధార్ ఓటీపీ ఆధారంగా ఈకేవైసీ పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రైతులకు పెట్టుబడి సాయం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజనలో లబ్ధిదారులను గుర్తించారు. అన్నదాత సుఖీభవకు రైతుల బయోమెట్రిక్ తప్పనిసరి చేశారు. ఇప్పటికే ఈకేవైసీ 95 శాతం పూర్తయ్యిందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు ఇబ్బంది లేకుండా రెండు రోజుల్లో ఈకేవైసీ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనితో బయోమెట్రిక్ విధానాన్ని నిలిపివేసి ఈకేవైసీ పూర్తి చేయని రైతులపై అధికారులు దృష్టి సారించారు. త్వరితగతిన ఆధార్ ఓటీపీ ద్వారా ఈకేవైసీ పూర్తిచేయాలని క్షేత్రస్థాయిలో వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. అర్హులైన ప్రతీ రైతుకు ఈనెల 20న ఆర్థిక సాయం వారి ఖాతాలో జమ కావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. లబ్ధిదారులు ఈకేవైసీ పూర్తి చేసేందుకు అధికారులకు రెండు రోజులు గడువు ఇచ్చారు. గ్రామస్థాయి వ్యవసాయ శాఖ సిబ్బంది ఈకేవైసీ పూర్తిచేసేలా చర్యలు చేపట్టారు.

• కొల్లేటి గోడు

మమ్మల్ని బతకనివ్వండి

కేంద్ర సాధికార కమిటీకి వినతుల వెల్లువ



పందిరిపల్లిగూడెంలో కమిటీ దృష్టికి కొల్లేరు ప్రజల జీవనాన్ని, వారి సమస్యలను వివరిస్తున్న కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

- పెద్దఎత్తున తరలివచ్చిన కొల్లేరువాసులు
- కేంద్ర మంత్రి వర్మ సహా ఎమ్మెల్యేలు హాజరు
- పర్యావరణంతోపాటు ప్రజల జీవనమూ ముఖ్యమే
- కొల్లేటికోటలో భేటీకి హాజరైన వేలాది మంది
- కోర్టు నిబంధనలకు లోబడే నివేదిక : కమిటీ
- నేడు ఉంగుటూరు ప్రాంతంలో పర్యటన

'మా తాత, ముత్తాతల నుంచి మేం కొల్లేరునే నమ్ముకుని బతుకుతున్నాం. కొల్లేరు ఆపరేషన్ తర్వాత అంతా అస్తవ్యస్తమైంది. మా ఊళ్లలో తాగు నీరే కాదు, పశువులకు చెరువులు లేవు. ఇప్పటికి ఇళ్ల స్థలాలు లేవు. ఉన్నా మెరక చేసుకునే దిక్కు లేదు. జిరాయితీ, డి-ఫారం పట్టా భూములైనా పంచితే బతుకీడ్చుకొస్తాం. పక్షులతోపాటు మేము బతికేందుకు అవకాశం ఇవ్వండి' అంటూ కేంద్ర సాధికార కమిటీ ఎదుట కొల్లేరు వాసులంతా ఘొల్లుమన్నారు. తమ జీవన పరిస్థితులను కళ్లారా చూసి పెద్ద మనస్సుతో స్పందించండి అంటూ వేడుకున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి/కైకలూరు)

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కొల్లేరులో నెలకొన్న తాజా పరిస్థితులను అధ్యయనం చేయడానికి కేంద్ర సాధికార కమిటీ మంగళవారం కొల్లేరులో భాగమైన కైకలూరు ప్రాంతంలో పర్యటించింది. డిల్లీ నుంచి

(మిగతా 8వ పేజీలో)



సభకు హాజరైన కొల్లేటివాసులు

సమగ్ర నివేదిక ఇస్తాం : చంద్రశేఖర్ గోయల్



కేంద్ర సాధికార కమిటీలో చంద్రశేఖర్ గోయల్ ఒక్కరే తాము ఎందుకు కొల్లేరులో పర్యటించాల్సి వచ్చిందనే విషయాన్ని ప్రజలకు అర్థం అయ్యేలా వివరించారు. సుప్రీంకోర్టు పరిమితులకు లోబడి కొల్లేరులో పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణతోపాటు ప్రజల స్థితిగతులపై రెండు రోజులపాటు పర్యటిస్తామని, ఈ అంశాలపై నివేదికను ఉన్నత న్యాయస్థానానికి అందిస్తామని ప్రకటించారు. కొల్లేరుపై తగు సూచనలు, వినతులను అందరి నుంచి స్వీకరిస్తామని స్పష్టం చేశారు.

పర్యావరణానికి హాని కలిగించం

కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కొల్లేరు ప్రజల సమస్యలను వివరించారు. 30 ఏళ్ల క్రితం కొల్లేరులో జీవనోపాధి లేక స్థానికులు అలిపికాయలు తిని జీవనం సాగించేవారని, అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ప్రజలకు భూములు కేటాయించి చేపలు సాగు చేసేందుకు సొసైటీల ద్వారా బ్యాంకుల రుణాలు అందించేవారని వివరించారు. 120 జీవో తీసుకువచ్చి కొల్లేరు ఆపరేషన్ పేరుతో 2006లో చెరువులను ధ్వంసం చేశారన్నారు. సరస్సులో ఏటా వర్షాకాలంలో వరదల సమయంలో విషసర్పాలు ఇళ్లలోకి వస్తున్నాయని వివరించారు. 14 వేల ఎకరాల జిరాయితీ భూములు, 8 వేల డి.ఫారం పట్టా భూములు ప్రజలకు తిరిగి అందిస్తే వారికి ఉపాధి లభిస్తుందని, పర్యావరణానికి ఎలాంటి హాని కలగదని కమిటీ అన్ని రకాలుగా పరిశీలించి ప్రజలకు మేలు జరిగేలా చూడాలని కోరారు.

■ భూములను ప్రజలకు అందించాలి



కొల్లేరు సరిహద్దుల్లో జిరాయితీ భూములు, డి.ఫామ్ పట్టాలు వున్నాయి. పర్యావరణానికి నష్టం కలగకుండా వాటిని ప్రజలకు అందించి, వారి సమస్యలను తీర్చాలని కోరుతున్నాం. ఈ ప్రాంత ప్రజలు పర్యావరణానికి నష్టం కలిగించరు. పర్యావరణాన్ని, అటవీ శాఖ చట్టాలను కాపాడుకుంటూనే ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్ర కమిటీని కొల్లేరుకు తీసుకురావడంతో విజయం సాధించాం.

- కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

■ కొల్లేరులో జీవ వైవిధ్యం



కొల్లేరు సరస్సులో జీవవైవిధ్యం ఉంది. పర్యావరణానికి హాని కలగకుండా పక్షులు, సరస్సు, ప్రజలు అన్ని ఒకేచోట ఉండేలా చూడాలి. కొల్లేరులో జన సంచారం, సరస్సులు అన్ని ఒకేచోట ఉన్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకోవడమే గాక సుప్రీంకోర్టు నిబంధనలను పాటిస్తూ ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తాం. ప్రజాభిప్రాయంపై నివేదిక తయారుచేసి కమిటీకి, ప్రభుత్వానికి అందజేస్తాం.

- అటవీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనంతరాములు

■ కొల్లేటివాసులకు న్యాయం చేయాలి



కొల్లేరులో పుట్టి పెరిగిన ప్రజలందరికి జిరాయితీ, డిఫాం పట్టాలు అందించి కమిటీ న్యాయం చేయాలి. కొల్లేరులో ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఉపాధి కోసం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సమస్యలను కమిటీ స్వయంగా పరిశీలించింది, ప్రజలకు న్యాయం జరుగుతుంది. కోర్టు కూడా ఇటు పర్యావరణాన్ని, అటు పక్షులతోపాటు ప్రజల జీవితాన్ని పరిగణనలోకి తీసుకుంటుంది.

- చింతమనేని ప్రభాకర్, దెందులూరు ఎమ్మెల్యే

■ ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం



కొల్లేరు ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుంది. ప్రజల సమస్యలను కమిటీ దృష్టికి తీసుకువెళతాం. కోర్టులు రెండు వైపులా చూస్తాయి. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కాంటూరు కుదింపు, జిరాయితీ భూములు ప్రజలకు అందిస్తుందని ఆశిస్తున్నాం.

- కె.రఘురామకృష్ణరాజు, డిప్యూటీ స్పీకర్

■ ప్రజల గొంతును వినిపిస్తాం



కొల్లేరు ప్రజల గొంతును సీఈసీకి వినిపిస్తాం. 122 గ్రామాల్లో మూడు లక్షల మందికిపైగా జీవిస్తున్నారు. వారందరిది ఒకటే నినాదం. పర్యావరణాన్ని కాపాడుకుంటూ ప్రజల సమస్యలను కమిటీ దృష్టికి తీసుకువెళతాం. ప్రజానుకూల చర్యలు ఉంటాయని ఆశిస్తున్నాం.

- కలెక్టర్ వెట్రిసెల్వి

■ ఉపాధి పనులు చేపట్టాలి



కొల్లేరులో ప్రజలు జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు. జిరాయితీ, డి.ఫామ్ పట్టాలు అందించి ఆదుకోవాలి. కొల్లేరు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు నిర్వహించాలి. ఈ మేరకు కమిటీ నివేదికలో పొందుపరుస్తుందని ఆశిస్తున్నాం.

- ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ



కొల్లేరు పెద్దింటమ్మ గుడి వద్ద సీసీ టీవీ ఫుటేజ్

గుడికి భద్రత

సీసీ కెమెరాల ఏర్పాటుకు నిర్ణయం

- జిల్లాలో 601 ఆలయాలకు 2,461 కెమెరాలు అవసరం
- అంచనా సిద్ధం చేసిన దేవదాయ శాఖ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని అన్ని దేవాలయాలను భద్రత పెంచడంలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏ ఆలయానికి ఎన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనే అంశంపై అధికారులు దృష్టి సారించారు. భక్తుల రద్దీకి తగినట్లు సౌకర్యాల కల్పనపై దేవదాయశాఖ దృష్టి సారించింది. జిల్లాలోని దేవాలయాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు కానున్నాయి.

601 ఆలయాలకు అవసరం

జిల్లాలో కొత్తగా 601 దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఉన్నతాధికారులకు నివేదించారు. 6సీ కింద రూ.15 లక్షల ఆదాయం వచ్చేవి. నాలుగు చొప్పున అమర్చినా 2,461 కెమెరాలు అవసరం ఉందని పేర్కొన్నారు. గతంలో అంతర్వేది లక్ష్మీ నరసింహ దేవాలయంలో రథం దహనం సంఘటన నేపథ్యంలో అప్పట్లో జిల్లాలో 160 ఆలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పేరొందిన కొల్లేటి కోట పెద్దింటమ్మ గుడికి 16 సీసీ కెమెరాలున్నాయి. ప్రసిద్ధ ఆలయాలు, రథం ఉండే గుడికి ఒక సీసీ కెమెరా అమర్చేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

స్టోరేజీ పెంపు..

ఇప్పటికే సీసీ కెమెరాలు ఉన్న దేవాలయాల్లో 15 రోజుల బ్యాక్అప్ (స్టోరేజీ) కెపాసిటీ మాత్రమే ఉంది. తాజాగా సీసీ కెమెరా బ్యాక్అప్ కనీసం 90 రోజులు (3నెలలు) ఉండేలా ఏర్పాట్లు చేయాలని దేవదాయశాఖ ఉత్తర్వులిచ్చింది. కెపాసిటీ పెంపు దేవదాయశాఖ చేపడుతుందా? ఆలయ కమిటీ చేపట్టాలన్న దానిపై స్పష్టత లేదు. సీసీ కెమెరాల ఏర్పాటుపై దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కూచిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు వివరాలను అడిగారని, నివేదిక సమర్పించామన్నారు.

అధికారులు కావలెను!

జిల్లాల విభజన నేపథ్యంలో వివిధ శాఖల్లో సూపరింటెండెంట్, ఇతర కీలక అధికారులను పొరుగు జిల్లాలకు సాగనంపినా.. తాజా బదిలీల్లో భర్తీ కాలేదు. దాదాపు మూడేళ్ల నుంచి విధుల్లో ఉన్న అధికారులు, ఇతర సిబ్బందిపై భారం పడింది. బదిలీల్లో కీలక పోస్టులు భర్తీ చేయడం ద్వారా తమపై ఒత్తిడి తగ్గిస్తారని ఎదురు చూసినా చివరకు నిరాశే మిగిలింది.

- భర్తీ కానీ కీలక పోస్టులు
- బదిలీలపై ఆశలన్నీ ఆవిరి
- జిల్లా సహకార అధికారి పోస్టు ఖాళీ
- రెవెన్యూ, పరిశ్రమలు, దేవదాయ శాఖల్లో ఖాళీలు అనేకం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ శాఖల్లో ఒకేచోట ఐదేళ్లు పూర్తి చేసిన వారు, మూడేళ్లు దాటిన వారికి గత నెల 16 నుంచి ఈ నెల 9 వరకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏలూరు జిల్లా నుంచి కొంత మంది అధికారులు వెళ్లడం తప్ప, ఆయా స్థానాల్లో ఎవరూ నియమితులు కాలేదు. వివిధ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బందిని కొత్తగా ఏర్పాటైన జిల్లాలకు పంపించారు. ఇక్కడ అవసరమైన పోస్టులు భర్తీ కాకపోవడంతో ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారింది.

ఇన్‌చార్జిలతో సరి..!

జిల్లా సాంఘిక సంక్షేమశాఖ జేడీ జయప్రకాష్ బదిలీలకు ముందే రాష్ట్ర కార్యాలయానికి వెళ్లిపోగా, ఆయన స్థానంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.ముక్కంటి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో పది మందికి పైగా తహసీల్దార్లు, 14 మంది డిప్యూటీ తహసీల్దార్లు ఇన్‌చార్జులే కొనసాగుతున్నారు. జిల్లా కేంద్రమైన ఏలూరు తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ గాయత్రికి ఇన్‌చార్జిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లా పరిశ్రమల కేంద్రంలో సిబ్బంది కొరతతో జీఎం ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. సూపరింటెండెంట్, క్లస్టర్ ఇన్‌చార్జులు, డిప్యూటీ డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కీలకమైన సహకారశాఖాధికారి పోస్టు కూడా మళ్లీ ఖాళీ అయింది. జిల్లా ఆడిట్ అధికారిగా ఉన్న ఆరిమిల్లి శ్రీనివాస్ ఇన్‌చార్జి డీసీవోగా వ్యవహరించారు. ఆయన భీమవరం డివిజనల్ రిజిస్ట్రార్‌గా బదిలీ కావడంతో ఎవరికీ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించలేదు. సీనియర్ అయిన నూజివీడు డివిజనల్ రిజిస్ట్రార్ రవికుమార్‌కు అప్పగిస్తారని సమాచారం. 747 దేవాలయాలు పర్యవేక్షించాల్సిన దేవదాయశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ పోస్టుతోపాటు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల కొరత ఉంది. దేవదాయశాఖ ఏసీ సీహెచ్ రంగారావు బదిలీ కావడంతో కొల్లేటి కోట పెద్దింటమ్మ గుడి ఈవో కూచిపూడి శ్రీనివాస్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.



గనులశాఖ అసిస్టెంట్ జియాలజిస్ట్, ఒక టెక్నికల్ అసిస్టెంట్ పోస్టు భర్తీకాలేదు.

ఆర్అండ్ బీలో ఇంజనీర్ల కొరత

ఉమ్మడి జిల్లా ఆర్అండ్‌బి సర్కిల్‌లో 10 మంది అసిస్టెంట్ ఇంజనీర్ల పోస్టులు ఖాళీగా ఉండిపోయాయి. రహదారులు, ఇతర అంచనాల రూపొందించడం కష్టతరంగా మారింది. కనీసం సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లను అయినా తమకు కేటాయించాలని ఆర్ అండ్ బీ ఎస్ఈ కలెక్టర్‌కు ఇటీవల రాతపూర్వకంగా కోరినట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వం, ఆయశాఖల ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది.

సచివాలయ ఉద్యోగుల బదిలీ

● షెడ్యూల్ విడుదల ● 30లోగా పూర్తి కావాలి

భీమవరం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల బదిలీకి ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. ఉద్యోగుల ఖాళీలు, సిబ్బంది వివరాలను క్లస్టర్ వారీగా ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు ఈ నెల 16 నుంచి 18 వరకు నమోదు చేస్తారు. గ్రామ సచివాలయాల్లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. వ్యవసాయ శాఖ అసిస్టెంట్‌కు జేడీ, మత్స్యశాఖ అసిస్టెంట్‌కు ఫిషరీస్ డీడీ, సంక్షేమ అసిస్టెంట్‌కు సోషల్ వేల్ఫేర్ డీడీ ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగుల వివరాలను సంబంధిత హెచ్‌వోడీలు నమోదు చేయాలి. మునిసిపాలిటీల్లో కమిషనర్లు ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. పూర్వ పశ్చిమ గోదావరిని యూనిట్‌గా తీసుకుని బదిలీలు చేస్తారు. ఆన్‌లైన్‌లో నమోదైన ఉద్యోగుల వివరాలను ఈ నెల 25 నుంచి 29 వరకు కలెక్టర్ పరిశీలిస్తారు. బదిలీ బాధ్యతను పూర్వ పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌కు అప్పగించారు. బదిలీ ప్రక్రియ 30 నాటికి పూర్తికావాలి. ఐదేళ్లు పూర్తి కాని ఉద్యోగులు అభ్యర్థన చేసుకునే వెసులుబాటు కల్పించారు.

చర్లపల్లికి సండే స్పెషల్ పొడిగింపు

నరసాపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నరసాపురం - చర్లపల్లి మధ్య ఆదివారం ప్రత్యేక రైలును వచ్చే ఏడాది మార్చి 31 వరకు పొడిగిస్తూ మంగళవారం దక్షిణ మధ్య రైల్వే ఉత్తర్వులు జారీ చేసినట్లు స్టేషన్ మేనేజర్ మధుబాబు చెప్పారు. వేసవిలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఏప్రిల్‌లో ఈ రైలును పట్టాలెక్కించారు. శనివారం చర్లపల్లిలో 07233 నెంబర్‌తో రాత్రి 7.50కి బయలుదేరి ఆదివారం ఉదయం 5 గంటలకు నరసాపురం వస్తుంది. తిరిగి ఆదివారం 07234 నెంబర్‌తో నరసాపురంలో రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు చర్లపల్లి చేరుతుంది. నల్గొండ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతాయి.

27న షర్మిల రెడ్డి పర్యటన

ఏలూరు కార్పొరేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిలరెడ్డి ఈనెల 27న ఏలూరు నగరానికి వస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ రావు తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఏడు నియోజకవర్గాల కోఆర్డినేటర్లతో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. షర్మిల పర్యటన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు షర్మిల జిల్లాకు వస్తున్నట్లు తెలిపారు. కూటమి ఇచ్చిన సూపర్-6 హామీ అమలు చేయలేదని, ప్రజల పక్షాన పోరాడేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుట్టిందని తెలిపారు. కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కార్యాచరణ షర్మిల పర్యటిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పీసీసీ కార్యదర్శి గౌతు సత్యేంద్ర, నాయకులు ఉన్నమట్ల ఎలీజా, పెద్దిరెడ్డి సుబ్బారావు, మరీదు కృష్ణ, ఆలపాటి నరసింహమూర్తి, బొడ్డు నోబెల్, బండి విజయభాస్కర్, విస్సంపల్లి సుందరావు, కట్టా నాగరాజుగౌడ్, బోసురెడ్డి, కోటిరెడ్డి, తాళ్లూరి చక్రవర్తి, ప్రతాప సుబ్రహ్మణ్యశర్మ, లంకా రామ్మోహన్, సాదే బాబూ ప్రసాద్, జిల్లా మహిళా కాంగ్రెస్ చైర్మన్ సగర వరలక్ష్మి ఉన్నారు.



తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం

- భూసేకరణకు రూ.428.33 కోట్లు
- అవసరమైన భూమి 1,123 ఎకరాలు
- రెండు వారాల్లో వివరాలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు మరో అడుగు పడింది. ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రాష్ట్రంలో ఏడు విమానాశ్రయాల నిర్మాణాలకు భూసేకరణ నిర్వహించేలా అవసరమైన రూ.1570.64 కోట్లకు పరిపాలన అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆ దిశగా అనుమతులు మంజూరు చేసింది. శ్రీకాకుళం, కుప్పం, ఒంగోలు, నాగార్జునసాగర్, తుని-అన్నవరం, తాడేపల్లిగూడెం, నెల్లూరులోని దగదర్తిలో విమానాశ్రయాల ఏర్పాటుకు 8500 ఎకరాలు అవసరం కానుందని అంచనా కాగా రూ.1,570.64 కోట్లు అవసరం. తాడేపల్లిగూడెంలో ఏర్పాటుకు 1123.06 ఎకరాలు కావాల్సి ఉంటుంది. ఈ మొత్తం భూసేకరణకు రూ.428.33 కోట్లు అవసరం. భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. కలెక్టర్ సీహెచ్.నాగరాణి తాడేపల్లిగూడెం ఆర్డీవో, తహసీల్దార్లకు లేఖలు రాశారు. భూసేకరణ ప్రక్రియ వివరాలను రెండు వారాల్లో ఇవ్వాలని ఆదేశించారు. తాడేపల్లిగూడెం రూరల్ మండలం వెంకట్రామన్నగూడెం, జగన్నపేట రెవెన్యూ గ్రామాల పరిధిలో భూసేకరణ చేపట్టాలని ప్రభుత్వం దిశా నిర్దేశం చేసింది.

తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక ఇవ్వాలంటూ ప్రైవేటు ఏజన్సీకి ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. భూసేకరణకు ప్రభుత్వం పరిపాలన అనుమతి ఇవ్వడం, జిల్లా కలెక్టర్ దీనిపై చొరవ తీసుకుని తాడేపల్లిగూడెం రెవెన్యూ యంత్రాంగానికి లేఖ రాయడంతో ఆశలు చిగురించాయి.

డీఎస్సీ పరీక్షకు 43 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన పరీక్షకు 43 మంది గైర్హాజరయ్యారు. స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం 186 మంది అభ్యర్థులకు 183మంది, మధ్యాహ్నం 180మందికి 168 మంది హాజరయ్యారు. ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రంలో ఉదయం 147మందికి 140, మధ్యాహ్నం 140మందికి 136, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో ఉదయం 210 మందికి 206, మధ్యాహ్నం 200 మందికి 187 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

APSRTC పల్లె వెలుగు
టెండరు ప్రకటన
ఏలూరు జిల్లా పరిధిలోని వివిధ డిపోల పరిధిలో గల బస్‌స్టేషన్‌లలో స్టాల్స్/షాపులు/ క్యాంటిన్/ సైకిల్/ స్కూటర్ స్టాండ్ మొదలగు వ్యాపారములు చేసుకొనుటకు అనుభవము, ఆసక్తి ఉన్న వ్యాపారస్థుల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. (1) టెండరు ఫారములు సంబంధిత డిపో మేనేజరు వారి కార్యాలయములలో తేది.18-06-2025 నుండి తేది.26-06-2025 వరకు అన్ని ఆఫీసు పనిదినములలో ఉదయం 10.30 గంటల నుండి సా.5.00 గంటల వరకు పొందవచ్చును. (2) పూర్తి చేసిన టెండరు ఫారములను తేది.27-06-2025న ఉదయం 10.30 గంటల నుండి మ.02.00 గంటల లోపున జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయము, ఏలూరు నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సు నందు వేయవలెను. అదేరోజు మ.03.00 గంటలకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. (3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ : https://www.apsrtc.ap.gov.in లో Tenders ను చూడగలరు. (4) ఎట్టి కారణము చూపకుండా టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు APSRTC కి పూర్తి [illegible] కలదు.
నెం. P3/797(03)/2025-DPTO(ELR), తేది: 13-06-2025 సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, ఏలూరు.



ఇంగ్లీష్ చానెల్‌ను ఈదిన ఏలూరు శాప్ కోచ్ గణేష్

లండన్ నుంచి ఫ్రాన్స్ వరకు..
33 కిలోమీటర్లు..
3 గంటలు..

21 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

- 28వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన
- 25 నుంచి 30 వరకు కళాశాలల ఎంపిక
- 3న సీట్ల కేటాయింపు



లోపలి పేజీలో..

21 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

28వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన
25 నుంచి 30 తేదీ వరకు కళాశాలల ఎంపిక
జూలై 1న మార్పులకు అవకాశం.. 3న సీట్ల కేటాయింపు
ఉమ్మడి జిల్లాలో ఐదు హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు



భీమవరం రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పాలిసెట్-25 రాసి అర్హత సాధించిన విద్యార్థులకు పాలిటెక్నిక్‌లో చేరేందుకు ఈనెల 21 నుంచి కౌన్సెలింగ్ జరగనుంది. 28వ తేదీ వరకు ర్యాంకుల వారీగా సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు. 25వ తేదీ నుంచి 30 వరకు కళాశాల ఎంపిక చేసుకోవాలి. వచ్చేనెల 1వ తేదీన కళాశాలల ఎంపికలో మార్పులు చేసుకునే అవకాశం ఉంటుంది. 3వ తేదీన కళాశాలల్లో సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఉమ్మడి జిల్లాలో ఒక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు 8 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. 3,200 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈసారి పాలిసెట్‌లో ఉత్తీర్ణులైన వారి సంఖ్య ఎక్కువగా ఉన్నందున సీట్లు భర్తీ పెరుగుతుందన్న అంచనాలో కాలేజీల యాజమాన్యాలున్నాయి.

ఉమ్మడిలో ఐదు హెల్ప్‌లైన్ సెంటర్లు

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు ఉమ్మడి జిల్లాలో ఐదు హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఏలూరులో సీఆర్ రెడ్డి కళాశాల, తాడేపల్లిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్లు ఉంటాయి. అలాగే తణుకు ఎస్ఆర్‌వీఎం పాలిటెక్నిక్ కళాశాల , భీమవరం సీతా పాలిటెక్నిక్ కళాశాల, నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇవి పని చేస్తాయి.

సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ర్యాంకుల వారీగా

పాలిసెట్ కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈ విధంగా నిర్వహిస్తారు. ఈ నెల 21న 01 ర్యాంకు నుంచి 15 వేల ర్యాంకు వరకు, 22న 15001 ర్యాంకు నుంచి 32 వేల వరకు, 23న 32001 నుంచి 50,000 ర్యాంకు వరకు చేసుకోవాలి. 24న 50,001 నుంచి 68 వేల వరకు, 25న 68001 నుంచి 86,000 వరకు, 26న 86001 నుంచి 1 లక్షల 4 వేల ర్యాంకు వరకు చేసుకోవాలి. 27న 1 లక్షా 4001 ర్యాంకు నుంచి 1 లక్షా 20 వేల ర్యాంకు వరకు, 28న 1 లక్షా 20 వేల 1 ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకు వెరిఫికేషన్ జరుగుతుంది.

కళాశాలల ఎంపిక..ఫీజుల చెల్లింపు

ఈనెల 25, 26 తేదీల్లో 01 ర్యాంకు నుంచి 50 వేల ర్యాంకు వరకు కళాశాలల ఎంపిక చేసుకోవాలి. 27, 28 తేదీల్లో 50,001 ర్యాంకు నుంచి 90 వేల ర్యాంకు వరకు, 29, 30 తేదీల్లో 90 వేల 1 ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకు ఎంపిక చేసుకోవాలి. కౌన్సెలింగ్ ప్రాసెసింగ్ ఫీజు ఈ నెల 20 నుంచి చెల్లించవచ్చు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 చొప్పున ఆన్‌లైన్‌లో చెల్లించాలి.ఫీజు రసీదు, ఒరిజినల్ సర్టిఫికెట్స్, రెండు జతల జిరాక్స్ కాపీలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి.





విజయ దరహాసంతో పారా స్విమ్మర్ గణేష్

ఇంగ్లీష్ చానెల్‌ను ఈదిన ఏలూరు శాప్ కోచ్ గణేశ్

ఏలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీకి చెందిన పారా స్విమ్మర్ బలగ గణేశ్ ఇంగ్లీష్ ఛానెల్‌ను ఈది అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. స్విమ్మింగ్‌లో సత్తా చాటుతూ ఇప్పటికే పలు పతకాలను సాధించిన ఏలూరు శాప్ కోచ్, సీనియర్ పారా స్విమ్మర్ బలగ గణేశ్ ఆదివారం ఇంగ్లీష్ ఛానల్‌ను ఈది అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. లండన్ నుంచి ఫ్రాన్స్ వరకు 33 కిలోమీటర్లు మేర 13 గంటల 37 సెకన్ల పాటు ఇంగ్లీష్ ఛానెల్ ఈది సత్తా చాటాడు. ఆంధ్రప్రదేశ్ ట్రూప్‌లో నలుగురి బరిలో దిగగా గణేశ్ లక్ష్యాన్ని చేరుకున్నాడు. గత నెలలో పాక్ జలసంధిని గణేష్ అలవోకగా ఈదాడు

దేవునికి లోటు లేకుండా..



దూప, దీప నైవేద్యాలకు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంపు
దశలవారీగా తక్కువ ఆదాయం ఉన్న ఆలయాలకు వర్తింపు
ఏలూరు జిల్లాలో 160 దేవాలయాలకు పెంపు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి) : సంక్షేమం, అభివృద్ధిని గాడిన పెడుతున్న తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే దిశగా ముందడుగు వేస్తోంది. తాజాగా దేవదాయ శాఖలో సంస్కరణల పర్వానికి తెరలేపింది. వసతులు మెరుగుపర్చడం నుంచి దేవుడి దూప, దీప, నైవేద్యాలకు లోటు జరగకుండా చూస్తోంది. దశలవారీగా ఆదాయం తక్కువ ఉన్న దేవాలయాలకు రూ.5 వేలు విదల్చడానికి కష్టపడిన వైసీపీ ప్రభుత్వానికి దీటుగా తెలుగుదేశం ప్రభుత్వం రూ.10 వేలకు పెంచి దేవుడికి ఎటువంటి లోటు లేకుండా నిరంతరాయంగా పూజా కార్యక్రమాలను కొనసాగింపునకు నడుం బిగించింది. ఇప్పటి వరకు దశల వారీగా 160 దేవాలయాలకు ఈ మొత్తాలను అందిస్తున్నారు. ఇంకా ప్రతిపాదనలు సిద్ధం చేసినవి పదుల సంఖ్యలో ఉన్నాయి.

వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం

వైసీపీ ప్రభుత్వంలో ఆలయాల నిర్వహణ పూర్తిగా అటకెక్కింది. దేవుడు మాన్యాలను, ఇతర ఆస్తులను కబ్జాలు చేయడమే పనిగా అప్పటి పాలకులు వ్యవహరించారు. తక్కువ ఆదాయంతో దీపదూప నైవేద్యాలకు ఇబ్బంది పడుతున్న దేవాలయాలకు ఇప్పుడు మంచి రోజులు వచ్చాయి. దీపదూప నైవేదాల్యతో పాటు అర్చకుల జీతాల నిమిత్తం గ్రామాల్లోని పురాతన దేవాలయాలకు దే వదాయశాఖ ప్రతినెలా కొంత నగదు అందిస్తున్నది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెలకు రూ.5 వేలు ఇచ్చేవారు. అది కూడా కొద్ది సంఖ్యలోనే ఇచ్చే వారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.10 వేలు చేసింది. దీనిలో అర్చకుని జీతంగా ఏడువేలు, దీపదూప నైవేద్యాలకు రూ.3 వేలు కేటాయించారు. దశలవారీగా అయా ఆలయాల నుంచి ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ల ద్వారా ప్రతిపాదనలను స్వీకరించి, ప్రాధాన్యతల వారీగా ఆయా మొత్తాల పెంపుదలను అమలు చేస్తోంది. జిల్లాలో 716 దేవాలయాలున్నాయి. వీటి పరిధిల్లో 12,870 ఎకరాల భూములున్నాయి. మాగాణి 5,400 ఎకరాలు, మెట్టలో 6,290 ఎకరాలు, చేపల చెరువులు, ఇతర రకాలు భూములు 964 ఎకరాలున్నాయి. కొన్ని నియోజకవర్గాల పరిధిలో ఆలయ భూములను బహిరంగ వేలం ద్వారా కౌలుకు ఇచ్చి వాటి ద్వారా ఆదాయం పెంచాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. కానీ అవి అక్కరకు రాకపోవడంతో దేవాలయాలు నిర్వహణ కుంటు పడుతూ వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాలకు ఆదాయాలు లేకపోవడంతో దాతలు, స్థానికుల సహాయంతో దేవుడి కార్యక్రమాలను చక్కబెడుతున్నారు.

ఇవే ప్రధాన అర్హతలు

దూప, దీప, నైవేద్యం పథకంలో రూ.10 వేలు విడుదల కావాలంటే ఆ ఆలయం నిర్మించి 25 ఏళ్లు పూర్తి కావాలి. గ్రామీణ ప్రాంతంలో ఉండాలి. ఆలయానికి భూమి ఐదు ఎకరాల్లోపు ఉండాలి. ఆదాయం రూ.లక్షకు మించి ఉండరాదు. పెంచిన డబ్బును గత నవంబరు నెల నుంచి అందిస్తున్నారు. ప్రతీనెలా ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ల ద్వారా ప్రతిపాదనలు అడుగుతున్నారు. ఏలూరు డివిజన్ ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ సురేష్ మాట్లాడుతూ చాలావరకు దీనావస్థలో ఉన్న వాటికి ఇవి చాలావరకు ఉపయోగపడుతున్నాయి.టీటీడీ కూడా దేవాలయ కార్యక్రమాలకు ఇతోధికంగా సేవలందిస్తోందన్నారు.



కమిటీ సభ్యులకు వినతి ఇస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



కొల్లేరు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు



పందిరిపల్లిగూడెంలో సీఈసీ కమిటీకి వినతిపత్రాలు అందజేస్తున్న సీపీఎం నాయకులు

వినతుల వెల్లువ : కైకలూరు, మండవల్లి మండలాల్లో కొల్లేరులో పర్యటించేందుకు వచ్చిన కేంద్ర సాధికార బృందానికి కొల్లేరు వాసుల నుంచి వినతులు వెల్లువెత్తాయి..

గోడు పట్టదు.. గూడు దక్కదు !



కుక్కునూరు మండలం కివ్వాకలో నిర్వాసితుల పునరావాస కాలనీ

పోలవరం నిర్వాసితుల పట్ల నిర్లక్ష్యం

గత ప్రభుత్వ చర్యలతో అసంపూర్తిగా కాలనీలు
కూటమి ప్రభుత్వంలో పోలవరంపై కదలిక
నిరాశ్రయుల కాలనీలపై ప్రత్యేక దృష్టి
ఉభయగోదావరి జిల్లాల్లో 49 కాలనీల పనులు రద్దు
నివేదిక ఇవ్వడంలో తీవ్ర అలసత్వం
సెప్టెంబర్ నెలాఖరుకు అప్పగించాలని ప్రభుత్వ ఆదేశం
సమస్యపై నివేదిక ఇవ్వని ఐదు శాఖల అధికారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రతిష్టాత్మకమైన పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం తమ జీవన అలవాట్లను, సంస్కృతిని, సంప్రదాయాలను, ఇళ్లను, పొలాలను త్యాగం చేసిన నిరాశ్రయులను ఆదుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గత వైసీపీ అన్ని విధాలా నిరాశ్రయులను నిర్లక్ష్యం చేయగా గత సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవడానికి అధికారులను ఆదేశించింది. కానీ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఎక్కడి సమస్య అక్కడే అన్నట్టు ఉంది. గతంలో తెలుగుదేశం అధికారంలో ఉండగా ప్రారంభించిన కాలనీలను వైసీపీ నిర్లక్ష్యం చేయడంతో 49 కాలనీలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఆ కాలనీలపై దృష్టి పెట్టిన కూటమి ప్రభుత్వం పనులు చేసే కాంట్రాక్టు సంస్థలను రద్దు చేసింది. అంతే కాకుండా అక్కడ పనుల పరిస్థితిపై నివేదిక ఇచ్చి త్వరగా టెండర్లు పిలిచి సెప్టెంబరు నెలాఖరు నాటికి కాలనీల పనులు పూర్తి చేసి నవంబరులో నిరాశ్రయులకు అప్పగించాలని స్వయానా సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. గృహనిర్మాణ సంస్థ, పంచాయతీరాజ్, సోషల్ వెల్ఫేర్, ఆర్అండ్‌బీ, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఇంతవరకూ పనులు జరిగాయి. ప్రస్తుత పరిస్థితిపై ఆయా డిపార్ట్‌మెం ట్‌లే నివేదిక ఇవ్వాలి. కానీ ఇంతవరకూ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వలేదు. మరో వారమో, రెండు వారాలో పడుతుందని చెప్పడం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం లక్ష్యం దెబ్బ తింటోంది. త్యాగజీవులైన నిరాశ్రయులు కనీసం తలదాచు కోవడానికి ఇల్లు లేని పరిస్థితి నెలకొంది.

నాడు టీడీపీ ప్రభుత్వంలో వేగవంతం

2014లో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ అనేక పోలవరం నిరాశ్రయ కాలనీల నిర్మాణం చేపట్టి కొన్ని పూర్తి చేసిన సంగతి తెలిసింది.కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ పోలవరం నిర్వాసితుల జీవితాలతో ఆటలాడుకుంది. కాలనీల నిర్మాణాన్ని గాలికొదిలేసింది. పెండింగ్ సమస్యలు పట్టించుకోలేదు. గత ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో పనుల్లో మళ్లీ కదలిక వచ్చింది. పోలవరం ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఎం చంద్రబాబు పనులు వేగవంతం చేసిన సంగతి తెలిసిందే. ప్రాజెక్టు పూర్తయ్యేలోపు నిర్వాసితులకు పూర్తిస్థాయి న్యాయం చేస్తానని చంద్రబాబు ప్రకటించారు. ఆ దిశగా ఆదేశాలిచ్చారు. ఫేజ్-1లో మొత్తం 38,060 కుటుంబాలకు రీహేబిటేషన్‌తో పాటు రీసెటిల్‌మెంట్ చేయవలసి ఉంది. 2024 డిసెంబర్ నాటికి 14,662 కుటుంబాలకు పునరావాసం కల్పించగా 2025 మార్చినాటికి 21,441 కుటుంబాలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేశారు. మరో 6779 కుటుంబాలకు సంబంధించి ప్రక్రియ నడుస్తోంది. ఇంకా 16,619 కుటుంబాలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయవలసి ఉంది. పనులు వేగవంతం చేయడానికి ఫేజ్-1ను ఫేజ్1ఎ, ఫేజ్1బి కింద విభజించారు. ఫేజ్-1ఎలో 20,946 కుటుంబాలు ఉన్నాయి. వారి కోసం ఏలూరు జిల్లా, అల్లూరి సీతారామరాజు ఏజెన్సీ జిల్లాల్లో 75 కాలనీలు ప్రతిపాదించారు. నిర్వాసితుల కోరిక మేరకు పక్క జిల్లాలో కూడా కాలనీలు నిర్మిస్తున్నారు. ఉదాహరణకు దేవీపట్నం పరిధిలోని నిర్వాసితులకు తూర్పుగోదావరి జిల్లాలోని గోకవరం మండల కేంద్రంలో రెండు గ్రామాలకు చెందిన సుమారు 700 కుటుంబాలు, అదే మండలంలోని కృష్ణుడిపాలెం పంచాయతీ పరిధిలో 16 గ్రామాలకు చెందిన 1067 కుటుంబాలకు కాలనీలు నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకూ 26 కాలనీలు పూర్తి చేశారు.14,369 కుటుంబాలను ఆయా కాలనీలకు తరలించారు. 49 కాలనీలు నిర్మాణంలో ఉండగా 6577 కుటుంబాలను తరలించాల్సి ఉంది.

49 కాలనీల కాంట్రాక్టు ఒప్పందం రద్దు

49 పునరావాస కాలనీల్లో పనులు మందగించాయి.గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు మందగించాయి. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం జనవరిలో అప్పటి వరకూ ఉన్న పెండింగ్ బిల్లులను క్లియర్ చేసింది. ఇంకా సుమారు రూ.120 కోట్ల వరకూ పెండింగ్ ఉంది. 49 కాలనీలకు సంబంధించి ఏఎస్ఆర్ జిల్లాలో 19 కాలనీలు ఉన్నాయి. అందులో 4951 ఇళ్లు నిర్మించాల్సి ఉండగా 4130 నిర్మించారు. ఇంకా 821 ఇళ్లు నిర్మించాల్సి ఉంది. ఇప్పటి వరకూ 67 శాతం మాత్రమే పనులు జరిగాయి. ఏలూరు జిల్లాలో 30 పునరావాస కాలనీలు ఉండగా అక్కడ 8987 ఇళ్లను నిర్మించాల్సి ఉంది. ఇప్పటి వరకూ 7529 ఇళ్లను నిర్మించారు. ఇంకా 1458 ఇళ్లు నిర్మించాలి.ఇక్కడ 60 శాతం పూర్తయింది. ప్రాజెక్టు పరిధిలోని ఉభయగోదావరి జిల్లాల్లో ప్రస్తుతం కాంట్రాక్టు రద్దయిన 49 కాలనీల్లో మొత్తం 13,938 ఇళ్లు నిర్మించాల్సి ఉండగా 11,659 నిర్మించారు. ఇంకా 2279 నిర్మించాల్సి ఉంది. ఈ ప్రాంతాల్లో మౌలిక వసతులు, మంచినీటి సమస్య ఉంది. ఏఎస్ఆర్ జిల్లాలో 227 అభివృద్ధి పనులకు 134 పూర్త య్యాయి. 45 ప్రారంభం కాలేదు. మిగిలినవి వివిధ దశల్లో ఆగిపోయాయి. ఏలూరు జిల్లా పరిధిలో మొత్తం 507 శాంక్షన్ కాగా 193 పూర్తయ్యాయి. 219 అసలు పునాదులు వేయలేదు. మిగతావి వివిధ దశలలో ఆగిపోయాయి. వీటన్నింటిని సెప్టెంబరు నాటికి పూర్తి చేసి, నవంబర్ నాటికి 6577 కుటుంబాలకు ఆయా గృహాలకు తరలించాలనే లక్ష్యంతో పనిచేయాల్సి ఉంది. అయితే ఆయా కాలనీల్లో ఏఏ పనులు చేయాలో పూర్తి నివేదికనే అధికారులు రూపొందించలేకపోయారు. కాలనీల నిర్మాణంలో అవకతకలు ఏమైనా జరిగినా ఈ నివేదికలో ఇవ్వవలసి ఉంది. మరి అధికారులు నివేదిక ఎపుడిస్తారో, టెండర్లు ఎపుడు పిలుస్తారో, పనులు ఎపుడు మొదలు పెడతారో మరి...?

మలి వయసులో జీవన పోరాటం

వయసు సహకరించదు.. కళ్లు సరిగా కనిపించవు.. తూలిపడబోయి నిలదొక్కుకుంటూ మరీ జీవన పోరాటం చేస్తున్నారు ఈ బామ్మలు.. ఎంతో కొంత సంపాదిస్తే అవసరానికి ఉంటుందన్న ఆశతో జీవనం గడుపుతున్నారు. ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రపరిసరాల్లో యాత్రికులను ప్రాధేయపడుతూ విక్రయాలు జరుపుతున్నారు.. ఎనిమిది పదుల వయసులో కూడా వీరి కష్టాన్ని చూసి నేటి యువత ఎంతో నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. ద్వారకా తిరుమలకు చెందిన వెంకాయమ్మకు 80 ఏళ్లవరకూ వయసు ఉంటుంది. చూపు సరిగా కనిపించదు. వచ్చిన భక్తులను బతిమాలి మరీ కాశీతాళ్లు వంటివి విక్రయిస్తోంది. పెన్షన్ వస్తోందని అది తమ మందులకు సరిపోవడం లేదని బతుకు తెరువు కోసం ఓపిక లేకున్నా రోజూ ఇలా తాళ్లు అమ్ముకుంటున్నట్లు వెంకాయమ్మ తెలిపింది. ద్వారకాతిరుమలకు దాదాపు 7 కి.మీల దూరంలో ఉన్న కోడిగూడెం అనే గ్రామం నుంచి గంగమ్మ నిమ్మకాయలు విక్రయిస్తుంటుంది. కోడిగూడెంకు చెందిన దమయంతి సీజనల్ వచ్చే పూలను, కూరగాయలను విక్రయిస్తూ తన వంతు సాయంగా ఈ వయసులోనూ కుటుంబానికి అండగా ఉంటోంది. తిమ్మాపురం తోటల్లో మల్లెపూలను కొనుగోలు చేసి వాటిని ద్వారకాతిరుమలకు వచ్చే భక్తులకు, స్థానికులకు విక్రయిస్తూ జీవిస్తోంది.

-ద్వారకాతిరుమల (ఆంధ్రజ్యోతి)



నిమ్మకాయలు...నిమ్మకాయలు..



పూలు కావాలా బాబూ..



ఎవరైనా కొనేందుకు వస్తే బావుండు..

జోరుగా సార్వా



పంటబోదెలు శుభ్రం చేస్తున్న రైతులు.. చేనుకు నీరు పెట్టేందుకు ..





ట్రాక్టర్‌తో దుక్కి దున్ని నారుమడికి సిద్ధం చేస్తున్న పొలం

వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి.. రైతులు సార్వా దుక్కుల్లో బిజీగా ఉన్నారు.. ఎక్కడికక్కడ పంట బోదెలు శుభ్రం చేసుకోవడం, ట్రాక్టర్లతో పొలం దుక్కి దున్నడం, నారుమడుల కోసం పొలాన్ని చదును చేయడం, విత్తనాలు జల్లడం వంటి దృశ్యాలే కనిపిస్తున్నాయి.. వర్షాలు కురవడం, కాల్వలకు నీరు విడుదల చేయడంతో రైతులు చాలా ప్రాంతాల్లో ఉత్సాహంగా సార్వా పనులు మొదలుపెట్టారు. ఉంగుటూరు మండలం నారాయణపురం సమీపంలో కనిపించిన దృశ్యాలివీ..

ఫొటోలు : ఫొటోగ్రాఫర్ , భీమవరం



నారుమడి కోసం పొలం చదును చేస్తూ..



విత్తనాలు జల్లుతూ..



సిద్ధమైన నారుమడి

నరసాపురంలో రూ.3.50 కోట్లతో బ్లడ్ బ్యాంకు



నరసాపురంలో ప్రభుత్వ ఆస్పత్రి

నరసాపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నరసాపురం ప్రభుత్వ ఆస్పత్రికి బ్లడ్ బ్యాంకు మంజూరైంది. దీని నిర్మాణానికి కేంద్రం రూ.3.50 కోట్లు మంజూరు చేసిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుప్రియ తెలిపారు. బ్లడ్ బ్యాంకు ఏర్పాటుపై మంగళవారం ఆస్పత్రిలో వైద్యులు సమావేశయ్యారు. ఆస్పత్రిలో రక్త పరీక్షలకు విభాగాలకు సంబంధించిన వైద్యుల పర్యవేక్షణలో దీన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో రెడ్‌క్రాస్‌కు సంబంధించి బ్లడ్ బ్యాంకు స్టోరేజ్ మాత్రమే ఉంది. దీన్ని 2015లో ఏర్పాటు చేశారు. తణుకు మదర్ బ్యాంకు అనుసంధానంగా పనిచేస్తుంది. దీనికి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కేంద్ర హెల్త్ మిషన్ రాష్ట్రంలో 14 ఆస్పత్రులకు బ్లడ్ బ్యాంకులను మంజూరు చేసింది. వాటిలో పశ్చిమ గోదావరి జిల్లాలో నరసాపురం ఉంది. ప్రస్తుతం కొనసా గుతున్న బ్లడ్ స్టోరేజ్ యూనిట్ గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. దాన్ని రెన్యువల్ చేయలేదు. దానిస్థానంలో బ్లడ్ బ్యాంకును ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.


ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

జీతాలు, పీఎఫ్ బకాయిలు చెల్లించాలి

» విధులు బహిష్కరించి పారిశుధ్య కార్మికుల ధర్నా

ఏలూరు క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు జీతాలు, పీఎఫ్ బకాయిలు చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, ప్రధాన కార్యదర్శి వి.దత్తాత్రేయ డిమాండ్ చేశారు. మంగళవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద విధులు బహిష్కరించి నిరసన ప్రదర్శనలను పారిశుధ్య కార్మికులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 16న జిల్లాలోని అన్ని ఆసుప త్రులలో చేసిన ధర్నాకు ఫస్ట్ ఆబెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కాంట్రాక్టర్ దిగి వచ్చారని అయితే 20వ తేదీ వరకు గడువు కోరారని గతంలో కూడా ఇదే విధంగా సమయం తీసుకుని విఫలం చెందారని ఈ నేపథ్యంలోనే తమ నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. పారిశుధ్య కార్మిక నాయకులు, వినోద్, విజయ, నిర్మల, కోటేశ్వరి, నాయకత్వం వహించారు.

యోగా పోటీల్లో శోభనాపురం విద్యార్థులు ఫస్ట్

ఆగిరిపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): యోగా రోల్‌ప్లే రాష్ట్రస్థాయి పోటీల్లో శోభనాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. అంతర్జాతీయ 11వ యోగాంధ్ర దినోత్సవంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా, గుంటుపల్లిలో 16వ తేదీన నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీల్లో శోభనాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు యోగా రోల్‌ప్లే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం సాధించారని హెచ్‌ఎం యామిని కృష్ణప్రియ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భార్గవి, మండల విద్యాశాఖ అధికారులు సర్వేశ్వరరావు, ఆనంద్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, పాఠశాల ఏఎంసీ చైర్మన్ దాసరి రాంప్రసాద్, యోగా ట్రైనర్ బొద్దూరి సాంబశివరావు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.


కుక్కునూరులో విత్తుతున్న పత్తి విత్తనాలు

ఖరీఫ్ సీజన్ ఆరంభం

పత్తి సాగుపై రైతాంగం దృష్టి

» కుక్కునూరులో పలుచోట్ల పొలాల్లో విత్తిన పత్తి విత్తనాలు

కుక్కునూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని కుక్కునూరులో ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ఆరంభమైంది. భారీ వర్షాలు కురవకపోయినా మోస్తరుగా వర్షాలు కురవడంతో రైతులు ఇప్పటికే పొలాల్లో దుక్కులు దున్నారు. వారం రోజులుగా అక్కడక్కడ చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. ఈక్రమంలో రైతులు పత్తిసాగును ఆరంభించారు. మెట్టప్రాంతాల్లో పత్తివిత్తనాలు విత్తడం ఆరంభించారు. గడిచిన మే నెలలో వర్షాలు కురిసినప్పటికి జూన్‌లో మాత్రం వర్షాలు ఆశించినంతగా కురవలేదు. వర్షాలు కురుస్తాయనే ఆశతో పొడుదుక్కుల్లోనే విత్తనాలు విత్తుతున్నారు. గత ఏడాది ఆశాజనకంగా పత్తి పండినప్పటికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులకు లాభం చేకూరలేదు. క్వింటా పత్తి రూ. 6వేల నుంచి రూ.7 వేల మధ్యలోనే పలికింది. ఈ ఏడాది ఎన్నో ఆశలతో మళ్లీ పత్తిసాగు ఆరంభించారు. కుక్కునూరు పంచాయతీలో కొర్లకుంట, ఇనుకపాడు, లంకాలపల్లి ప్రాంతాల్లో పత్తివిత్తనాలు విత్తడం రైతులు ప్రారంభించారు. గతంలో వర్షాలు కురిసి పత్తి పంట దిగుబడి వచ్చి ఆశించిన ధర ఉంటే రైతులు ఈ ఏడాది అయినా అప్పుల ఊబి నుంచి బయటపడి లాభాల వైపు నడిచే అవకాశం ఉందని రైతులు ఆశిస్తున్నారు.


ఆచంట-కొడమంచిలి ఆర్‌అండ్‌బీ రోడ్డు మధ్యలో శిథిలావస్థకు చేరిన తాడేరు డ్రెయినేజీ వద్ద వంతెన

శిథిలావస్థలో వంతెనలు

» డ్రెయినేజీలపై వంతెనలకు బీటలు.. భయాందోళనలో ప్రజలు

ఆచంట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆచంట మండలంలో పలు డ్రెయినేజీలపై ఉన్న వంతెనలు కొన్నిచోట్ల బీటలు తీసి వంగి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా ఆచంట, కొడమంచిలి ఆర్‌అండ్‌బీ రోడ్డు మధ్యలో కొడమంచిలి వద్ద తాడేరు డ్రెయిన్ వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వంతెన కింది భాగంలో అనేక చోట్ల బీటలు తీసి ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనపై తారు రోడ్డు ఉండడంతో పైకి మాత్రం బాగానే ఉంటుంది. నిత్యం ఈ వంతెనపై పలు వాహనాలు తిరుగుతూనే ఉంటాయి. వంతెన శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆచంట వేమవరం వద్ద నక్కడ డ్రెయిన్‌పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. మండలంలో పలు చోట్ల బలహీనంగా ఉన్న వంతెన స్థానాల్లో కొత్త వంతెనలు నిర్మించి ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

పీల్చి పిప్పి చేస్తారు..!



ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీ

లేని రోగాలు అంటకడుతున్నారు

అవసరం లేకపోయినా రక్త పరీక్షలు

మందుల్లోనూ మాయాజాలం

తణుకులో ఓ ఆసుపత్రిలో డెంగీ లేకపోయినా వైద్యం..

లబోదిబోమన్న బాధితుడు

తాడేపల్లిగూడెంలో గ్యాస్‌నొప్పితో వెళితే గుండెనొప్పి అన్నారు..

తాడేపల్లిగూడెం రూరల్ (ఆంధ్రజ్యోతి):

- పెంటపాడు మండలం రావిపాడుకు చెందిన ఓ మహిళ అనారోగ్యంతో ఇబ్బంది పడుతోంది. అయితే ఇంటి వద్ద కొన్నాళ్ల వైద్యం చేయించుకున్నా తగ్గక పోవడంతో తణుకులో ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ పరీక్షలన్నీ చేయించారు. పరీక్షలకే సుమారు రూ.6 వేల వరకూ ఖర్చయింది. అయితే ఆ పరీక్షల్లో డెంగీ ఉన్నట్టు నిర్ధారించారు. ఆ ఆసుపత్రి వైద్యులు ఆ రోగానికి ఖరీదైన వైద్యం అందించారు. అయితే మధ్యలో అనుమానం వచ్చి మరో ల్యాబ్‌లో పరీక్షించగా డెంగీ లేదని రిపోర్టు వచ్చింది. ఇదేంటి ఇలా చేశారని ఆసుపత్రి నిర్వాహకులను నిలదీస్తే తమ రిపోర్టే ఫైనల్ అని బయట రిపోర్టులతో తమకు సంబంధం లేదంటూ బుకాయించారు. చేసేదేమీ లేక ఆ రోగి బంధువులు మిగిలిన బిల్లు చెల్లించి బయటకు రావాల్సిన పరిస్థితి. మొత్తం బిల్లు రూ.75 వేలైంది.
- ఉండికి చెందిన ఓ రోగి భీమవరంలోని మరో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి పరీక్షించుకుంటే అతనికి కూడా డెంగీ నిర్ధారణ అయింది. వెంటనే భయపడి ఆ ఆసుపత్రి వాళ్లు చెప్పిన వైద్యం మొత్తం చేయించుకున్నాడు. అన్ని చేయించుకున్నాక రిపోర్టు మారిందని, వైరల్ ఫీవర్ కాస్తా డెంగీ ఉన్నట్టు చెప్పారని ఆసుపత్రి ల్యాబ్ వారు చెప్పగా అప్పటికే డెంగీకి వైద్యం చేయించుకున్న వ్యక్తి చేసేదేమీ లేక చేసిన వైద్యానికి రూ.45 వేలు బిల్లు కట్టాల్సిన పరిస్థితి.
- తాడేపల్లిగూడెంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఓ వ్యక్తి గ్యాస్ ఇబ్బంది ఉందని ఓ ఆసుపత్రిలో చేరితే ఆ ఆసుపత్రి వైద్యులు ఇది గుండెకు సంబంధించి సమస్యలా ఉందంటూ వెంటనే గుండెకు సంబధించిన ఈసీజీ, ఎకో పరీక్షలు చేసేశారు. గుండెకు స్టంట్ పడుతుందని వెంటనే సొమ్ములు రెడీ చేసుకోవాలని చెప్పారు. అయితే భయపడిన సదరు వ్యక్తి తన ఇంటి పత్రాలు తాకట్టుపెట్టి వారు అడిగిన లక్షన్నర ఆసుపత్రికి చెల్లించి స్టంట్ వేయించుకున్నాడు. కానీ ఆ వ్యక్తి రిపోర్టు తెలిసిన మరో వైద్యుడికి చూపిస్తే ఇది గుండె సమస్య కాదు...గ్యాస్ సమస్య అని చెప్పడంతో ఆ రోగి బంధువులు లబోదిబోమన్నారు.

ఇవన్నీ పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల మాయాజాలానికి మచ్చుతునకలు. రోగి భయమే ఆసుపత్రులకు పెట్టుబడి. ప్రజలు వారికి వచ్చే రోగాల నుంచి కాపాడమంటూ ఆసుపత్రులను ఆశ్రయిస్తుంటే ఆసుపత్రులు మాత్రం వ్యాపారం చేసుకుంటున్నారు. లేనిపోని రోగాలను ప్రజలకు అంటగట్టి వారి నుంచి అందిన కాడికి సొమ్ములు లాక్కుని వారిని పీల్చి పిప్పి చేస్తున్నారు.



మారుమూల గ్రామీణ ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చే అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని చిన్నపాటి రోగానికి కూడా పలురకాల వైద్య పరీక్షలు చేయించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులు అందుబాటులో ఉన్నప్పటికీ అధికశాతం రోగులు ప్రాణ భయంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునేందుకు వెళ్తుంటారు. అదే అదనుగా ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు దండుకుంటున్నారు. ఒక పక్క ఆసుపత్రులు, మరోపక్క ల్యాబ్‌లు కలిసి రోగుల రక్తం పీలుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జ్వర బాధితులే లక్ష్యం..

ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల్లో చిన్నపాటి రోగం వచ్చినా ఏమైందోనని భయపడి వైద్యులను ఆశ్రయిస్తున్నారు. అయితే ప్రస్తుత సీజన్‌లో జ్వరం సర్వ సాధారణంగా వస్తోంది. రానున్నది వర్షాకాలం.. జ్వరాలు ఇబ్బంది పెడుతుంటాయి. ఆసుపత్రులు జ్వరపీడితులే లక్ష్యంగా చేసుకుని రక్తపరీక్షల పేరుతో నిలువుదోపిడీ చేస్తున్నారు. ఆసుపత్రుల వద్దే అనుమతులు లేకపోయినా ల్యాబ్‌లు పెట్టి రక్తపరీక్షల నుంచి ఎక్స్‌రే, ఈసీజీ తదితర పరీక్షలంటూ వేలల్లో దోచేస్తున్నారు. ఆ తరువాత మందుల రూపంలో మరింత దోచేస్తున్నారు.

కలెక్టర్ సీరియస్

కలెక్టర్ నాగరాణి ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష చేస్తున్న సమయంలో లేని డెంగీ రోగానికి వైద్యం చేస్తారా ? పిల్లలకు కామెర్లు లేకున్నా ఆ వైద్యం పేరుతో ఎన్టీయార్ ఉచిత వైద్యంలో బిల్లు చేసుకుంటారా ? అని పలు విషయాలపై ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాకంపై మండిపడ్డారు.. జిల్లాలో ప్రయివేటు వైద్య నిర్వాకానికి ఇది అద్దం పడుతోంది.

కనిపించని ఫీజుల పట్టిక

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులు ల్యాబ్‌ల్లో ఏ పరీక్షకు ఎంత ఫీజు తీసుకోవాలన్నది ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల ప్రకారం పట్టికను అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలి. కానీ జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలో, ల్యాబ్‌ల్లో ఎక్కడా ఫీజులు వివరాల పట్టిక కనిపించదు. పైగా ఒక్కో వైద్యానికి ఒక్కో ప్యాకేజిని నిర్ణయించి రోగుల నుంచి భారీగా డబ్బులు దండుకుంటున్నారు.

మన ధర మనమే నిర్ణయించాలి

కోకో రైతులందరూ సంఘటితం కావాలి

సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, రిటైర్డ్ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అరుదైన సాగు కోకో పంట అని దాన్ని కాపాడుకునే బాధ్యత రైతులదేనని మన పంటకు మనమే ధర నిర్ణయించే స్థాయికి రైతులందరూ సంఘటితం కావాలని కోకో రైతు సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, రిటైర్డ్ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోళ్ల వెంకట సుబ్బారావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కోకో రైతు సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించే పంటల్లో కోకో పంట ఒకటని ఆ పంటకు మనం నిర్ణయించిన ధరకు కంపెనీలు కొనేస్థాయికి మన సాగు వృద్ధి చెందడంతో పాటు రైతులంతా ఒక ఆర్గనైజేషన్‌లా ఏర్పడాలన్నారు. ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్‌గా మూడు వేల మంది రైతుల వరకూ ఏర్పడటం ద్వారా కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహం పొందడంతో పాటు మన కోకో గింజలు అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రోసెస్ చేయాలన్నారు. అలా చేయడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్ మన కాళ్ల ముందుకు వస్తుందన్నారు. ప్రస్తుతం ఉన్న కోకో కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులను ఏమారుస్తున్నాయని ప్రభుత్వం కూడా ఆ కంపెనీలను ప్రశ్నించే పరిస్థితి లేదన్నారు. ఈ సందర్భంగా రైతులంతా కలిసి ముందుకెళదామని తీర్మానించుకున్నారు.కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోళ్ల వెంకట సుబ్బారావు, సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు బల్లు రామకృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆలపాటి వాసు, రాయల కాళిబాబు, గారపాటి వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.


ఐక్యత చాటుతున్న కోకో రైతు సంఘ నాయకులు


సదస్సు హాజరైన కోకో రైతులు

బాలిక జీవితంతో ఆటలు..

» ఇద్దరు యువకుల అత్యాచారం

» విజయవాడ ఆస్పత్రిలో ఓ బిడ్డకు జన్మ

» ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

భీమవరం క్రైం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఒక బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారం జరపడంతో గర్భం ధరించి ఓ బిడ్డకు జన్మనిచ్చిన ఘటన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో చర్చనీయాంశమైంది. మేలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా బయటకు పొక్కింది. ఒడిశా రాష్ట్రానికి చెందిన బబ్లూ అనే యువకుడు అదే రాష్ట్రానికి చెందిన ఓ బాలికను తీసుకుని ఉపాధి నిమిత్తం భీమవరం వచ్చారు. స్థానికంగా ఓ హోటల్‌లో వీరిద్దరూ పనిచేస్తూ కొంతకాలం ఉన్నారు. ఈ నేపథ్యంలో బాలికపై బబ్లూ అత్యాచారం జరపడంతో గర్భందాల్చింది. బాలికకు 8వ నెల వచ్చిన అనంతరం బబ్లూ గుట్టు చప్పుడు కాకుండా ఒడిశాలోని స్వగ్రామం వెళ్లిపోయాడు. ఒంటరైన బాలికను అస్సాం రాష్ట్రానికి చెందిన జగన్నాథ్ అనే యువకుడు వశపర్చుకున్నాడు. అనంతరం వీరిద్దరూ భీమవరం నుంచి విజయవాడ వెళ్లిపోయారు. అక్కడ ఓ గదిని అద్దెకు తీసుకుని నివాసం ఉన్నారు. మే 17న ఆ బాలికకు నొప్పులు రావడంతో విజయవాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. మే 19న ఆ బాలిక ఓ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటనపై ఆసుపత్రి యాజమాన్యం కృష్ణలంక పోలీసులకు సమాచారమిచ్చారు. కృష్ణలంక పోలీసులు వివరాలు సేకరించి ఈ కేసును భీమవరం టూటౌన్ పోలీసులకు రిఫర్ చేశారు. బబ్లూను పోలీసుల అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. జగన్నాథం కోసం గాలిస్తున్నట్టు సమాచారం. అయితే బాలికని తెలిసి పనిలో పెట్టుకున్న హోటల్ యజమానిపై పోలీసులు చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. బాలిక గర్భం దాల్చి 8వ నెల అయినప్పటికీ పోలీసులకు ఎలాంటి సమాచారం అందించకపోవడంతో కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇతర రాష్ట్రాల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి కొందరు హోటల్ యాజమాన్యాలు తీసుకొచ్చి మైనర్లను కూడా పనిలో పెట్టుకోవడం ఎప్పటి నుంచో యథేచ్ఛగా కొనసాగుతున్నట్టు ప్రచారం సాగుతోంది. తక్కువ జీతాలు కాబట్టి వారితో పని చేయించుకుని సరైన వసతులు కల్పించకపోవడం వల్లే ఇలాంటి కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపణలు ఉన్నాయి. వీరిపై కార్మిక శాఖ ఎటువంటి చర్యలు తీసుకుంటుందో వేచిచూడాలి.

భర్తపై అనుమానంతో భార్య ఆత్మహత్య

పెదవేగి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): భర్త వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో భార్య మనస్థాపంతో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. అంకన్నగూడెం గ్రామానికి చెందిన పల్లిపాము సురేష్, సౌందర్యలు భార్యాభర్తలు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా భర్త సురేష్ వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని భార్య సౌందర్యకు అనుమానం. దీనిపై పలుమార్లు వారిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ విషయమై సోమవారం సాయంత్రం మరోసారి ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసు కుంది. భర్త ఆ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూనే ఉన్నాడని భావించిన సౌందర్య(32) సోమవారం రాత్రి ఉరివేసుకుంది. అర్ధరాత్రి గమనించిన కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై కేసున మోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కె.రామ కృష్ణ తెలిపారు.

భీమవరంలో యువకుడిపై దాడి

భీమవరం క్రైం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తులు తనపై దాడి చేసి గాయపరిచారంటూ భీమవరం 26వ వార్డు బ్యాంకు కాలనీకి చెందిన నేతల పాల్ వన్‌టౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. నేతల పాల్ ఈ నెల 15న చర్చి ప్రారంభం సందర్భంగా భోజనానికి వెళ్లాడు. అక్కడే భోజనం చేస్తున్న సత్తాడ శాస్త్రి, సత్తాడ సుధీర్‌ల పక్కకు వెళ్లాడు. వారు పక్కకు వెళ్లమనడంతో వాగ్వాదం జరిగింది. అదేరోజు మధ్యాహ్నం పాలు కిరాణా కొట్టుకు వెళ్ళగా కారులో వచ్చిన సత్తాడ శాస్త్రి, సత్తాడ సుధీర్‌లు ఇనుప వస్తువులతో పాలుపై దాడి చేయగా బంధవులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నాగరాజు తెలిపారు.

మహిళపై ప్రభుత్వ ఉద్యోగిని దాడి

జేసీకి, పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

భర్తతో వివాహేతర సంబంధం నడుపుతుందనే అనుమానమే దాడికి కారణం

ఏలూరు రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి):తన భర్తతో వివాహేతర సంబంధం కలిగి ఉందేమోనన్న అనుమానంతో ఓ మహిళా ప్రభుత్వ ఉద్యోగిని నడిరోడ్డుపై మరో మహిళపై దాడి చేసింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ మేరకు ప్రభుత్వ ఉద్యోగినిపై బాధితురాలు జేసీకి, పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏలూరు రూరల్ మండలం రామకృష్ణాపురం ప్రాంతంలో నివాసముంటున్న బొల్లె సుజాత ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. ఏలూరుకు చెందిన మెరుగు నాని, సుజాత గతంలో ప్రేమించుకున్నారు. వీరి వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో ఇద్దరూ విడిపోయారు. అనంతరం నానికి ఓ ప్రభుత్వ మహిళా ఉద్యోగితో వివాహమైంది. సుజాతకు నానీ మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతుందని సదరు మహిళ ఉద్యోగికి కొందరు తెలిపారు. దీంతో నానీపై ఆమె అనుమానం పెంచుకుంది. ఇదే సమయంలో శనివారం సాయంత్రం ప్రభుత్వ ఉద్యోగినికి సుజాత తారసపడింది. దీంతో ఒకసారిగా సుజాతపై నానీ భార్య నడిరోడ్డుపై దాడికి దిగింది. ఈ ఘటన జరుగుతున్న సమయంలో అటుగా వచ్చిన పోలీసులు సదరు ప్రభుత్వ ఉద్యోగినిని వారించినా వినలేదు. ఇదే విషయాన్ని స్థానికులు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్ అయ్యింది.



ప్రైవేటు గోల్డ్ ఫైనాన్స్ సిబ్బంది వేధింపులతో యువకుడి ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు గోల్డ్ ఫైనాన్స్ సిబ్బంది వేధింపులు తాళలేక జంగారెడ్డిగూడెం మండలం లక్కవరానికి చెందిన బంటుమిల్లి గణేశ్(24)ఆత్మహత్య చేసుకున్నాడు. గణేశ్ తండ్రి బంటుమిల్లి రామారావు కొవ్వూరు డీఎల్‌పీవో కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్నారు. ఈయనకు గణేశ్, సతీశ్ అనే ఇద్దరు కుమారులున్నారు. ఎనిమిది నెలల క్రితం పెద్ద కుమారుడు గణేశ్ అత్తిలి మండలం మంచిలిలో కీర్తన గోల్డ్ ఫైనాన్స్‌లో లోన్ ఆఫీసర్‌గా ఉద్యోగంలో చేరాడు.ద్వితీయ కుమారుడు సతీశ్ రాజమండ్రిలో మరో ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. వీరంతా కొవ్వూరు మండలం దొమ్మేరులో అద్దెకు నివాసం ఉంటున్నారు. మే 30, 31 తేదీల్లో బంధువుల వివాహం నిమిత్తం గణేశ్ సెలవు పెట్టాడు. తర్వాత రోజు జూన్ 1న వర్షం కారణంగా ఉద్యోగానికి ఆలస్యంగా వెళ్లాడు. దీంతో బ్రాంచ్ మేనేజరు సిబ్బంది ముందు గణేశ్‌పై దుర్భాషలాడాడు. దీంతో అవమానకరంగా భావించి గణేశ్ పెంటపాడు సమీపంలోని ముదునూరులో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డా డు. విషం తాగేముందు స్నేహితునికి ఫోన్ చేసి చెప్పాడు. అలర్ట్ అయిన బంధువులు మంచిలి బ్రాంచ్ మేనేజర్‌కు ఫోన్ చేసి ఆసుపత్రికి తీసుకెళ్లాలని కోరినా పట్టించుకోలేదు. దీంతో లక్కవరం నుంచి బంధువులు వెళ్లి గణేశ్‌ను తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అ క్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం రాజ మండ్రిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిం చారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున గణేశ్ మృతి చెందాడు. పెంటపాడు పోలీసులు మంచిలి కీర్తన ఫైనాన్స్ బ్రాంచ్‌కి చెందిన ముగ్గురు సిబ్బందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


గణేశ్(ఫైల్ ఫొటో)

భీమవరంలో రాజస్థాన్ బృందం హల్‌చల్

కష్టాల్లో ఉన్నామంటూ చందాలు డిమాండ్



భీమవరంలో సంచరిస్తున్న ముఠా, చూపిస్తున్న లెటర్

భీమవరం క్రైం, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : రాజస్థాన్ రాష్ట్రంలో ఇళ్లు కోల్పోయామని, చేతనైన సహాయం చేయాలంటూ భీమవరం పట్టణంలో కొన్ని ముఠాలు రెండ్రోజులుగా హల్‌చల్ చేస్తున్నాయి. గతంలోనూ ఈ ముఠాలు ఏలూరు, భీమవరం, తణుకు వంటి పట్టణాల్లో ఇలాగే వ్యవహరించిన ఘటనలున్నాయి. రాజస్థాన్, బీహార్, ఉత్తరప్రదేశ్,మహారాష్ట్ర వంటి ప్రాంతాల నుంచి ఎక్కువగా వీళ్లు ఆంధ్రాకు వచ్చి ఇలాంటి వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలున్నాయి. వీరంతా కొన్ని ముఠాలుగా వచ్చి ఆయా పట్టణాల్లో టీమ్‌లుగా తిరుగుతుంటాయి. వీరు ఎక్కువగా వస్త్ర దుకాణాలు, బంగారు దుకాణాలు, రద్దీగా ఉన్న ప్రాంతాలను ఎంచుకుంటారు. అక్కడ చోరీలకు పాల్పడటానికి అవకాశం ఉన్నందున అలాంటి ప్రాంతాలనే ఎంచుకుంటున్నారు. బాలికలను కూడా ఈవృత్తిలోకి దింపి దందాలు చేస్తున్నారు. రెండేళ్ల క్రితం భీమవరంలో ఇటువంటి దందా చేయడంతో వారిపై 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. దీంతో కొంత కాలం కనబడలేదు. మళ్ళీ రెండు, మూడు రోజులుగా వారు ఈ ప్రాంతాల్లో హల్‌చల్ చేస్తున్నారు. దీనిపై పోలీసు అధికారులు చర్యలు తీసుకుని వారిపై నిఘా పెట్టాలంటూ పలువురు కోరుతున్నారు.

నేడు పెదవేగి ఆయిల్‌పామ్ కేంద్రాన్ని సందర్శించనున్న మంత్రి నాదెండ్ల

ఏలూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 18న ఉదయం 10.45 గంటలకు పెదవేగిలోని ఆయిల్‌పామ్ పరిశోధనాకేంద్రాన్ని సందర్శించనున్నారు. ఆయిల్ పాం ఉత్పాదకులతో సమావేశమవుతారు. అక్కడి నుంచి మధ్యాహ్నం బయల్దేరి హైదరాబాద్‌కు వెళ్తారు.

పాఠశాలకు షోకాజ్ నోటీసు

కామవరపుకోట, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : తడికలపూడిలో కేఆర్‌ఆర్ బ్రైట్ మైండ్స్ పాఠశాలకు మండల విద్యాశాఖ అధికారులు డీవైఈవో సూచన మేరకు మంగళవారం షోకాజ్ నోటీసులిచ్చారు. రెండ్రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో కోరారు. పాఠశాల నిర్వహించడానికి అనుమతులు తెలియజేయాలని కోరారు. ఎవరైనా అనుమతులు లేకుండా పాఠశాలలు, కళాశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ద్విచక్ర వాహనాల చోరీపై ఫిర్యాదు

భీమవరం క్రైం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఇళ్ల ముందు ఉంచిన ద్విచక్ర వాహనాలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారంటూ ఇరువురు వన్‌టౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు.తాడేరు రోడ్డులోని టిడ్కో ఇళ్ల వద్ద షేక్ బాబ్జి సోమవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేశాడు. ఉదయం లేచేసరికి వాహనం కనిపించలేదు. అలాగే 10న కె. నాగరాజు వాహనం కూడా కనిపించలేదు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణాజీ తెలిపారు.



దిరుసుమర్రులో మద్యం స్వాధీనం

భీమవరం క్రైం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సయిజ్ స్టేషన్ మంగళవారం నిర్వహించిన దాడులలో భీమవరం మండలం దిరుసుమర్రు గ్రామంలో జి. బాబులు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు పి.ఉమామహేశ్వరరావు, పి.సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సయిజ్ ఇన్‌స్పెక్టర్ కె.బలరామరాజు తెలియజేశారు.

నేడు విద్యుత్ నిలిచిపోయే ప్రాంతాలివే..

ఏలూరు రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలం, చాటపర్రు సెక్షన్ గుడివాక లంక సబ్‌స్టేషన్‌లో క్రొత్త 33 కెవిలైన్ ఏర్పాటు చేస్తున్న కారణంగా పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. ఈ నెల 18, 19 తేదీల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కొక్కిరాయలంక, పైడిచింతప్పాడు, ఏరియా ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఎం.అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

యోగాంధ్ర సమావేశంలో గన్ని

భీమడోలు: విశాఖలో 21న నిర్వహించే యోగాంధ్రపై జరిగిన రివ్యూ సమావేశంలో ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు. విశాఖలో నిర్వహించిన సమావేశంలో మంత్రులు కూటమి నాయకులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



బలివే శ్రీరామలింగేశ్వర స్వామికి వెండిపాత్ర బహూకరణ



పెదవేగి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలం బలివే శ్రీరామలింగేశ్వర స్వామికి హైదరాబాద్‌కు చెందిన యలమంచిలి పండుబాబు, వాణీశ్రీ దంపతులు రూ.లక్ష విలువైన వెండి దార పాత్రను బహూకరించారు. స్వామిని దర్శించుకున్న పండుబాబు, వాణీశ్రీ దంపతులు పూజలు నిర్వహించిన అనంతరం వెండి దార పాత్రను ఆలయ అర్చకుడు భాస్కరరావుకు మంగళవారం అందించారు. దాత పండుబాబు మాట్లాడుతూ తమ ఇష్టదైవమైన రామలింగేశ్వర స్వామికి ఇచ్చిన మొక్కును చెల్లించుకోవడానికి హైదరాబాద్ నుంచి వచ్చామన్నారు. స్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని, స్వామి దర్శనానికి తరచుగా వస్తుంటామన్నారు. ఆలయ మాజీ చైర్మన్ ఎం.ఘంటేశ్వరరావు, టీడీపీ విజయరాయి క్లస్టర్ ఇన్‌చార్జ్ మంచినేని శ్రీనివాసరావు, అబ్బినేని రాంబాబు, ఎం.వంశీ పాల్గొన్నారు.

నరసింహారావుకు లయన్స్ బెస్ట్ సర్వీస్ అవార్డు



ఏలూరు రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ద్వారా ప్రజలకు సేవలందిస్తున్న ఎం.ఎల్.నరసింహారావు బెస్ట్ సర్వీస్ అవార్డును ఏలూరులో అందుకున్నారు. ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ ద్వారా ఆయన సేవలందిస్తున్నారు. ఉచిత వైద్య శిబిరాలు, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక సాయం, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు చేసిన కృషికి బెస్ట్ సర్వీస్ అవార్డు ప్రదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు పి.వి.రమణ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు.

ఏఎంసీ ఇన్‌చార్జి కార్యదర్శిగా నాగరాజు



దెందులూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి సెక్రటరీగా పి.నాగరాజును నియమించారు. ఇక్కడ కార్యదర్శిగా పనిచేస్తున్న ఎండీ వి.శ్రీనివాస్ పదోన్నతిలో భాగంగా ఏలూరు జిల్లా అధికారిగా వెళ్లారు. ఇక్కడ సీనియార్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న పి.నాగరాజును ఇన్‌చార్జి కార్యదర్శిగా నియమించారు. ఏలూరు వెళ్తున్న మార్కెట్ కమిటీ అసిస్టెంట్ కార్యదర్శి గౌరిశంకర్‌ను, పాలకొల్లు వెళ్తున్న సూపర్ వైజర్ వి.గౌతమ్‌లను డైరెక్టర్ మద్దాల దయానంద రాజు, ఇన్‌చార్జి సెక్రటరీ పి.నాగరాజు ఆధ్వర్యంలో సత్కరించారు. సీతారామాంజనేయ వర్తక సంఘం ప్రెసిడెంట్ ఆలపాటి రంగారావు, వర్తక సంఘం నాయకులు పానకాల రాయుడు, మాగంటి బాలాజీ పాల్గొన్నారు.

నేటి నుంచి గిరిజన గ్రామాల్లో పథకాలపై అవగాహన

జీలుగుమిల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు ధర్తీ ఆబా ఉత్కర్ష్ అభియాన్‌పై, పీఎం జన్మన్ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో టి.నిఖిల్ మధుశరణ్ అన్నారు. 18న అంకన్నగూడెంలో ప్రజాప్రతినిధులు మండల అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. గిరిజన ప్రాంతంలో వెనుకబడినవారికి పథకాలు అమలు, ఆధార్ నమోదు, కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు, పీఎం, కిసాన్, రైతు క్రెడిట్ కార్డులు, పించన్లు, బ్యాంకు ఖాతాల ప్రారంభం, ఆరోగ్య పరీక్షలు, పోషకాహార కిట్లు పంపిణీ చేస్తారన్నారు.

మహిళల భద్రతకు శక్తి టీం కృషి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న టీం

ఏలూరు క్రైం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి ప్రత్యేకంగా శక్తి టీంను ఏర్పాటు చేసిందని, శక్తి టీం ఇన్‌ఛార్జి, ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుబ్బారావు అన్నారు. ఏలూరు సత్రంపాడులో ఉన్న సాయి శ్రీపారామెడికల్ కళాశాలలో మంగళవారం మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. సీఐ సుబ్బారావు శక్తియాప్ గురించిన విషయాలపై పారా మెడికల్ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అత్యవసర నెంబర్లపై అవగాహన శక్తి టీం అవగాహన కల్పించింది.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

ఏలూరు అర్బన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(స్కిల్ హబ్) ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐలో ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో స్వల్పకాలిక శిక్షణకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ భూషణం తెలిపారు. శిక్షణ అనంతరం ప్రైవేటు సంస్థల్లో అవకాశాలు కల్పిస్తారని వివరించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ పూర్తిచేసి, 15 నుంచి 30 ఏళ్లలోపు నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 89785 24022 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మమ్మల్ని బతకనివ్వండి..

(5వ పేజీ తరువాయి)

మంగళవారం మధ్యాహ్నం ఏలూరు చేరుకున్న బృందం కొల్లేరు వెళ్లింది. అటవీ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంట రాగా అన్ని అంశాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. కొల్లేరు వాసులు కష్ట, సుఖాలను ప్రస్తావిస్తూ తమ వినతులను కమిటీకి అందజేశారు. కొల్లేటికోటలో ఏర్పాటు చేసిన భేటీలో సమస్యలను ఏకరవు పెట్టారు. ఓ వైపు కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజుతోపాటు ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, మాజీ ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ తదితరులు కొల్లేరు స్థితిగతులను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. కొల్లేరు పరీవాహకంలో మూడు లక్షల మందికిపైగా జీవిస్తున్నామని, ఈ ప్రాంత పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూనే సమాంతరంగా తమ జీవన స్థితిగతులను పరిగణనలోకి తీసుకోవాలని అత్యధికులు తమ వినతుల్లో కమిటీకి నివేదించారు. జిరాయితీ, డి-ఫారం పట్టాభూములను తమకు పంచే విషయంలో ఒకింత సానుకూలత చూపాలని అభ్యర్థించారు. కొల్లేరు ప్రాంతంలో 122 గ్రామాలున్నాయని, ఈ ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణి సంరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకుంటునే ఉన్నామని కలెక్టర్ వెట్రిసెల్వి కమిటి దృష్టికి తీసుకెళ్లారు.

పర్యటన సాగింది ఇలా : కమిటి తొలిరోజు శ్రీపర్రు, కలకుర్రు, ఆటపాక, కొల్లేటికోట, పైడిచింతపాడు, పత్తికోళ్లంక. గుడివాకలంక, మొండికోడు, చాటపర్రు ప్రాంతాల మీదుగా పర్యటిస్తున్నప్పుడు స్థానికులు స్వాగతం పలికి వినతులను సమర్పించారు. అంతకుముందు ఏలూరు చేరుకున్న కమిటి సభ్యులు చంద్రశేఖర్ గోయల్, డాక్టర్ జేఆర్ భట్, జి.భానుమతి, సునీల్ లిమాయే, ప్రకాశ్‌చంద్రభట్‌తో పాటు అటవీ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంత రాముకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్వాగతం పలికారు. కమిటీ వెంట ఎస్పీ కిశోర్, ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ అజయ్‌కుమార్‌నాయక్, మత్స్యశాఖ కమిషనర్ రమాశంకర్ నాయక్, పశ్చిమ జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఎఫ్‌వోలు శుభం, విజయ, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ ఉన్నారు.

వినతుల వెల్లువ: పెనుమాకలంక, ఇంగిలిపాకలంక, మణుగులూరు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేశారు. ఆటపాక పక్షుల కేంద్రంలో కొల్లేరు మ్యాప్‌ను పరిశీలించారు. సరస్సు ఉనికి, ఏయే దేశాల నుంచి పక్షులు వలస వస్తున్నాయి, పర్యాటక వసతులు, తదితర వివరాలను అటవీ శాఖ అధికారులు సీఈసీ కమిటీకి వివరించారు. కైకలూరు మండలం పందిరిపల్లిగూడెంలో సుమారు 10 వేల మంది కొల్లేటివాసులతో సీఈసీ కమిటీ సమావేశమైంది. ప్రధానంగా మంచినీటి చెరువులు, పశువుల చెరువులు, ఇళ్ల స్థలాలు,వాటిని మెరక చేయడం, శ్మశాన వాటికలు, రహదారులపై అన్ని గ్రామాల నుంచి అర్జీల రూపంలో ప్రజలు తమ డిమాండ్లను ఎక్కువగా వినిపించారు. సీపీఎం, సీపీఐ నాయకులు కొల్లేరు సమస్యను పరిష్కరించాలని రాత పూర్వకంగా అర్జీలను కమిటీ సభ్యులకు అందించారు. కొల్లేరు అభయారణ్య పరిధిలో పక్షులకు ఎలాంటి హాని కలిగించబోమని సమావేశానికి హాజరైన ప్రజలతో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు భగవంతుని సాక్షిగా ప్రమాణం చేయించారు.

అనంతరం సాధికార కమిటీ సభ్యులు రాత్రి ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరానికి కమిటీ చేరుకుని వినతులను స్వీకరించారు. దెందులూరు, ఏలూరు, ఉంగుటూరు ప్రాంతాల రైతులు, కొల్లేరు వాసులు, పర్యావరణవేత్తలు తమ అభిప్రాయాలతో కమిటీకి వినతులను అందించారు. కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ గోయల్‌కు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తోపాటు ఆయన కుమార్తె నవ్యశ్రీ కొల్లేరు సమస్యలపై వినతులు సమర్పించారు. కమిటీ బుధవారం ఉంగుటూరు నియోజకవర్గంలో పర్యటిస్తుంది. ఆ తదుపరి కలెక్టరేట్‌లో ప్రత్యేక సమీక్ష సమావేశానికి హాజరు కానుంది.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్సాహంగా విద్యా కిట్ల పంపిణీ

భీమడోలు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందజేస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి విద్యా కిట్లను సద్వినియోగ పర్చుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పోలసానపల్లి సర్పంచ్ షేక్ హసీనా రహిమా బేగం అన్నారు. పోలసానపల్లి ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారాల కిట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి వంట పదార్థాలను పరిశీలించారు. కూటమి నాయకులు, గంజి సుబ్బారావు, శ్రీనుబాబు, గోవిందరావు, హెచ్‌ఎం తులసి పాల్గొన్నారు.

● దెందులూరు: గాలాయగూడెం దళితవాడలోని ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం నాగలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ ఉప్పటి మహేశ్‌లతో కలిసి మంగళవారం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మద్దా దయానందరాజు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన ఆహారం అందిస్తున్నట్టు తెలిపారు.

● జంగారెడ్డిగూడెం: విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో రాష్ట్ర విద్యారంగం దేశ వ్యాప్తంగా అద్భుత ప్రగతిని సాధిస్తుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీనివాసపురం మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు విద్యామిత్ర కిట్లను దాసరి శేషు స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, సర్పంచ్ యడ్లపల్లి రాణి, ఉప సర్పంచ్ పోలాడి శ్రీను, ఎస్ఎంసీ చైర్మన్ తమర్ని నిర్మల, తడికల దావీదు పాల్గొన్నారు.



గాలాయగూడెంలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



దుగ్గిరాలలో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని





టి.నర్సాపురంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, లింగపాలెం క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

లబ్ధిదారుల్లో తల్లికి వందనం ఆనందం

హర్షం వ్యక్తమవుతోందన్న ఎమ్మెల్యే చింతమనేని

సమస్యలు పరిష్కరిస్తామన్న ఎమ్మెల్యే చంటి

పెదవేగి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంతో పేదల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందిందన్నారు. దుగ్గిరాల కార్యాలయంలో మంగళవారం పలువురు ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వినతులు అందించారు. వారి సమస్యలు విన్న ఎమ్మెల్యే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే చిన్నారుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తుందని, సంపూర్ణ సాక్షరత లక్ష్యం నెరవేరుతుందని ప్రభాకర్ స్పష్టం చేశారు. పార్టీ నాయకులు యూఎస్.రామ్‌ప్రసాద్, తాతా సత్యనారాయణ, మంచినేని శ్రీనివాసరావు, కమ్మ శివరామకృష్ణ, పెనుబోయిన మహేష్ యాదవ్, మోత్కూరి నానీ, నాగరాజు, బలుసు శ్రీనివాస్ చౌదరి పాల్గొన్నారు.

● ఏలూరుటూటౌన్: తల్లికి వందనం జమ కానీ వారికి త్వరలో చెల్లించే ఏర్పాట్లు చేస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎమ్మెల్యే తల్లుల ఖాతాలకు ఎందుకు డబ్బులు పడలేదో పరిశీలించాలన్నారు. సాంకేతిక పరమైన సమస్యలుంటే పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో నగర కమిషనర్ ఏ.భాను ప్రతాప్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్ పాల్గొన్నారు.

● టి.నర్సాపురం: తల్లికి వందనం పేదలకు వరం అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి అన్నారు. టి.నర్సాపురం సచివాలయం వన్ వద్ద తల్లికి వందనం లబ్ధిదారులు కూటమి నాయకులు మంగళవారం చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.ఎన్నికల హామీ మేరకు ఒక్కొక్కరికి రూ.13 వేల చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. జనసేన పార్టీ మండలాధ్యక్షుడు అడపా నాగరాజు, పెద్దిన సత్యనారాయణ, నవీన్, కాసమనేని వెంకట్రావు, నవీన్, మండం ఆదిత్య కుమార్, పాలేటి సత్యనారాయణ, గంధం ముత్తయ్య పాల్గొన్నారు.

● లింగపాలెం: తల్లికి వందనం పథకం అర్హులందరికీ అందజేస్తున్నట్టు టీడీపీ మండలాధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు అన్నారు. సర్పంచ్ యలమంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండలంలోని కెగోకవరం హైస్కూల్లో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేపట్టారు. అంతేకాకుండా సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పేరుతో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంతో పాటు అనేక సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే రోషన్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ప్రధానోపాధ్యాయుడు నరశింహరావు, తాతిన రాధాకృష్ణ, మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై బీజేపీ అవగాహన



కొయ్యలగూడెం సమావేశంలో పాల్గొన్న నాయకులు

దెందులూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై చల్లచింతలపూడి, కొత్తకమ్మవారిగూడెం, పాత కమ్మవారిగూడెం, రామారావుగూడెం, మేదినరావుపాలెం గ్రామాల్లో అవగాహన కల్పించారు. మోదీ అధికారంలోకి వచ్చి 11 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. బీజేపీ దెందులూరు మండలాధ్యక్షురాలు చీకటి లక్ష్మీప్రసన్న, టీడీపీ మండల కార్యదర్శి నాగనబోయిన సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ఎం.మోహన్‌రావు, టీడీపీ గ్రామాధ్యక్షుడు వేమన రామగౌడ్, బీజేపీ నాయకుడు చీకటి ప్రభు చౌదరి పాల్గొన్నారు.

● చింతలపూడి: పేదల సంక్షేమమే మోదీ లక్ష్యమని, తన 11 ఏళ్ల పాలన ఇదే రుజువు చేస్తోందని రాష్ట్ర కిసాన్‌మోర్చ జోనల్ ఇన్‌చార్జి అర్జున్‌మురళీ పేర్కొన్నారు. వీకేఎం ఫంక్షన్ హాల్లో మోదీ సుపరిపాలనపై అవగాహన సభ నిర్వహించారు. బీజేపీ నాయకులు వరప్రసాద్, తోట వెంకట నారాయణ, విజయకుమారి, శ్రీనివాసరావు, ఎస్.ప్రసాద్, టీడీపీ నాయకులు తాటి అప్పారావు, ధర్మరాజు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: ఆపరేషన్ సిందూర్ ప్రపంచ దేశాలకు కనువిప్పని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొరగం వెంకటలక్ష్మి అన్నారు. దర్భగూడెంలో వికసిత భారత్ సంకల్ప కార్యక్రమం మంగళవారం వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ప్రధాని మోదీ 11 సంవత్సరాల పాలన దేశ చరిత్రలో చెరగని ముద్ర వేస్తుందని అన్నారు. వికసిత్ భారత్‌లో భాగంగా కేంద్రం అందించే సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించారు. బీజేపీ జిల్లా నాయకులు వేమూరి శ్రీనివాసరావు,జిల్లా కార్యదర్శి చాత్రాతి ప్రసాద్, మండలాధ్యక్షులు గుడ్ల రాంబాబు, నాయకులు కె.ఎల్.ప్రసాద్, కేతిరెడ్డి రాజకుమారి, పులగం సుబ్బారెడ్డి ఉన్నారు.

● కొయ్యలగూడెం: బీజేపీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం 11సంవత్సరాల పాటు దిగ్విజయంగా ముందుకు సాగుతోందని తపన ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సీతారామాంజనేయ చౌదరి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం స్థానిక రోటరీ ఫంక్షన్ హాల్లో వికసిత్ భారత్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆధ్వర్యంలో భారతదేశం అగ్రదేశాలకు దీటుగా ముందుకు వెళ్తుందన్నారు. రాష్ట్ర మహిళా మోర్చ అధ్యక్షురాలు బొల్లిన నిర్మలా కిషోర్, జిల్లా నాయకురాలు సుభద్రా దేవి, మండలాధ్యక్షుడు గొలిశెట్టి వాసు, శ్రీనివాస్, బాబు, చిరుమూరి శ్రీను, నంది పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో మేలైన విత్తనాలు ఎంచుకోవాలి

రైతులకు వ్యవసాయాధికారుల సూచన



లింగపాలెంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి


చింతలపూడి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాఘవాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు మేలైన వరి విత్తనాలపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ పాల్గొని మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో లబ్ధి పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రసాయనాల వాడకం తగ్గించి సేంద్రియ సాగు చేపట్టి భూమిని సారవంతం చేసేలా కృషి చేయాలన్నారు. ఉద్యానవన శాఖాధికారి సోఫియాపర్విన్ మాట్లాడుతూ కోకో, కొబ్బరి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉద్యాన రాయితీల గురించి వివరించారు. ఏఈవో శివకుమార్ పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: చొదిమెళ్లలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయశాఖ జేడీ షేక్ హబీబ్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు ప్రకృతి వ్యవసాయం, సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారుల నుంచి రైతులు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ఎంఏవో జీవన సంధ్య, టీడీపీ నాయకులు ఎడ్లపల్లి శివ పాల్గొన్నారు.

● కామవరపుకోట: గ్రామాల్లోని రైతులు నూతన సాంకేతిక పద్ధతులతో వ్యవసాయం వినియోగిస్తే తక్కువ ఖర్చుతో పాటు నాణ్యమైన దిగుబడులు లభిస్తాయని మండల వ్యవసాయ శాఖాధికారి డి.ముత్యాలరావు తెలిపారు. మంగళవారం ఆడమిల్లి, అంకాలంపాడు గ్రామాల్లో రైతులకు సమావేశం నిర్వహించి వ్యవసాయ సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధానాలను తెలియజేశారు. టీడీపీ మండల అధ్యక్షులు ఏలూరి హరిరామకృష్ణ, గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు వరలక్ష్మి, గంగాధరరావు పాల్గొన్నారు.

● లింగపాలెం: ప్రతిరైతు తమ పంట పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏడీఏ(డీటీసి) లలితసుధ అన్నారు. లింగపాలెం, సింగగూడెం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతిరైతు తమ పంటపొలాలలో భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఏడీఏ నాగకుమార్, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు మోరంపూడి మల్లికార్జునరావు, సర్పంచ్‌లు బొంతు రాంబాబు, తగరం హేమలత పాల్గొన్నారు.

మైదాన ప్రాంత ఉద్యోగులను ఏజెన్సీకి పంపొద్దు



పీవో రాములు నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): బదిలీలు, పదోన్నతుల పేరుతో మైదాన ప్రాంత ఉద్యోగులను ఏజెన్సీలకు బదిలీ చేయడాన్ని ఆదివాసీ మెడికల్& హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, సున్నం శ్రీరాములు దొర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం వెంకటేశ్వరావులు ఖండించారు. ఈ మేరకు మంగళవారం కె.ఆర్.పురం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ కె.రాములు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. జూమ్ కౌన్సెలింగ్ కాకుండా ఫిజికల్‌గా ఏర్పాటు చేయాలని కోరారు. జీవో 68ను దిక్కరించి నాన్ ట్రైబల్‌కు ఏజెన్సీ ప్రాంతంలో పోస్టింగులిస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆదివాసీ సంఘ నాయకులు వాపోతున్నారు. బదిలీలు, పదోన్నతుల పేరుతో మైదాన ప్రాంత ఉద్యోగులను ఏజెన్సీకి పంపే ప్రయత్నాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ఉద్యోగులు మైదాన ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటికే మైదాన ప్రాంతాల ఉద్యోగులకు పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారని, జిల్లాలో మెడికల్&హెల్త్ డిపార్టుమెంట్ శాఖలో ఇటువంటి బదిలీలు జరిగినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. అన్ని శాఖల్లోను ఇలాంటివి జరిగే అవకాశాలు ఉన్నందున్న ఆదివాసీ ఉద్యోగులు ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. మైదాన ప్రాంత ఉద్యోగులు ఏజెన్సీకి వస్తే అసోసియేషన్ ఆధ్వర్యంలో వారిని వెనక్కి పంపడానికి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

వ్యవసాయాధికారిగా ప్రియాంక

బుట్టాయగూడెం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారిగా ఎం.ప్రియాంక బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆకివీడు మండలంలో పనిచేస్తున్న ప్రియాంక బుట్టాయగూడెం బదిలీ కాగా ఇక్కడ పనిచేసిన డి.ముత్యాలరావు కామవరపుకోట మండలానికి బదిలీపై వెళ్ళారు. రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వ్యవసాయ పద్ధతులు అనుసరించేలా సహకారం అందిస్తానని ఆమె తెలిపారు.

ఎంపీపై ఆరోపణలు సహించం

కొయ్యలగూడెం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకుంటామని టీడీపీ పట్టణాధ్యక్షుడు జ్యేష్ట రామకృష్ణ, బీసీ నేత రాచూరి మదన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల కొన్ని పత్రికలు కొంతమంది ఎంపీపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఎంపీ మచ్చలేని నాయకుడని ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు.

ఇరిగేషన్ డీఈగా మనోజ్ కుమార్



కొయ్యలగూడెం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్ ఇరిగేషన్ డీఈగా మనోజ్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. మంగళవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. సబ్ డివిజన్‌లో చెరువులు, కాల్వల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈయనను పలువురు అభినందించారు.

నడవలేని వ్యక్తి వీల్ చైర్ అందజేత

లింగపాలెం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నరాలు చచ్చుబడి నడవలేని స్థితిలో ఉన్న వ్యక్తికి టీడీపీ నాయకులు వీల్‌చైర్‌ను అందజేశారు. మండలంలోని కొణిజర్లలో యాదాల నాగేశ్వరరావు అనే వ్యక్తి ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై నరాలు చచ్చుబడి మంచానికే పరిమితమయ్యాడు. దీంతో టీడీపీ నాయకుడు పల్లిశ్రీను ద్వారా తెలుసుకున్న బొప్పన రాధమ్మ నాగేశ్వరరావుకు వీల్‌చైర్ కొనేందుకు ఆర్థిక సహాయం అందించడంతో టీడీపీ నాయకుల ద్వారా వీల్‌చైర్ కొని నాగేశ్వరరావుకు అందించారు. యాదాల అశోక్, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీఐగా ఎం.వి.సుభాశ్ బాధ్యతలు



జంగారెడ్డిగూడెం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం సీఐగా ఎం.వి.సుభాష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం సర్కిల్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నిడమర్రు సీఐగా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

దేవస్థానం ఈవోగా కలగర శ్రీనివాస్



జంగారెడ్డిగూడెం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): గోకుల తిరుమల పారిజాత గిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఈవోగా కలగర శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈవోగా పనిచేసిన ఎం.రాంబాబు ముందూరు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈవోగా బదిలీపై వెళ్లారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఎమ్మెల్యే పరామర్శ



ద్వారకా తిరుమల, జూన్ 17 (ఆంధ్ర జ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం ఇటీవల మృతి చెందారు. దీంతో విశాఖపట్నంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, మండల టిడిపి నేతలతో కలిసి వెళ్లి ఆయనను పరామర్శించారు. పల్లా సింహాచలం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట పి.శ్రీనివాసరావు, లంకా సత్యనారాయణ ఉన్నారు.

డీఎల్‌ఎడ్ సెమిస్టర్ పరీక్ష ప్రశాంతం

ఏలూరు అర్బన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): డీఎల్‌ఎడ్ 4వ సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన పరీక్షకు 46మంది విద్యార్థులకుగాను 45మంది హాజరయ్యారని డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

21న జాబ్‌మేళా

ఏలూరుకార్పొరేషన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయం, నేషనల్ కెరీర్ సర్వీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21న జిల్లా ఉపాధి కార్యాలయం వేదికగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి వి.వరలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ మేళాలో ప్రముఖ సంస్థలైన అపోలో ఫార్మసీ, బజాజ్ కేపిటల్, ఎల్ఐసీ ఆఫ్ ఇండియా సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన 18-30 సంవత్సరాల వయస్సు కలిగిన యువత రావాలన్నారు. నెలసరి వేతనం 12 వేల నుంచి 15 వేల వరకు ఉంటుందని, అదనంగా ఇన్సెంటివ్స్ లభిస్తాయన్నారు. ఏలూరు, భీమవరం, విజయవాడ ప్రాంతాల్లో పని చేసేందుకు ఫార్మసీ సంస్థ ఫార్మసీ అసిస్టెంట్ పోస్టు లకు రెండేళ్ల అనుభవం ఉన్నవారిని ఎంపిక చేస్తామన్నారు.

కైకరంలో సి.ఐ. దంపతుల పూజలు

ఉంగుటూరు,జూన్(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలం కైకరంలో ఉన్న శ్రీవల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని మంగళవారం నిడమర్రు సీఐ మోగంటి వెంకట సుభాష్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చేబ్రోలు ఎస్.ఐ. ఎం.సూర్య భగవాన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ తరఫున పామర్తి సత్యనారాయణ, గురువెల్లి నాగేశ్వరరావు, యెగ్గిన సీతారాం కుమార్, కెంగం వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విజయవాడలో రాష్ట్ర సదస్సు

ఏలూరుకార్పొరేషన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలోని ఎం.బి.భవనంలో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్టు రైతు కూలీ సంఘ నాయకులు తెలిపారు.ఈ సదస్సుకు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఝాన్సీ అధ్యక్షత వహిస్తారని, సదస్సులో వడ్డే శోభనాదీశ్వరరావు, డాక్టర్ మరల సోమసుందర్, ఎస్.వేణుగోపాలరావు, బొజ్జ దశరథ రామిరెడ్డి, పాపారావు, దివాకర్‌బాబు, డి.వర్మ తదితర ప్రముఖులు హాజరవుతారన్నారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలి

ఏలూరుకార్పొరేషన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని, ప్రపంచ శాంతిని కాపాడాలని, పాలస్తీనాపై ఇజ్రాయేల్ దాడులను తక్షణమే నిలుపుదల చేయాలని కోరుతూ మంగళవారం పాతబస్టాండ్ సెంటర్‌లో వామపక్షాలు ధర్నా నిర్వహించాయి. పాలస్తీనా సంఘీభావ దినాన్ని పాటించారు. రాష్ట్ర స్థాయి వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపులో భాగంగా సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసి, ఎంసీపీఐ(యు) పార్టీల ఆధ్వర్యంలో ఇజ్రాయేల్‌కు వ్యతిరేకంగా పాలస్తీనాకు సంఘీభావంగా నిరసన తెలిపారు. సీపీఐ నాయకులు మన్నవ కృష్ణచైతన్య, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు, న్యూడెమోక్రసి నాయకులు కె.వి.రమణ, ఎంసీపీఐ నాయకులు ఎస్.నాగరాజు నిరసనలో పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

ఉంగుటూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కాగుపాడు పీహెచ్‌సీ పరిధిలోని ఉంగుటూరు సచివాలయ కాలనీలో మంగళవారం మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాగుపాడు ఆస్పత్రి వైద్యాధికారిణి పి.మానస, మలేరియా యూనిట్ తాడేపల్లిగూడెం ఆరోగ్య ఉప అధికారి వై.వీ.లక్ష్మణరావు, ఆరోగ్య సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి కే.శ్రీనివాసరావు, సిబ్బంది చంద్రకళ, ఎన్.గణపతి, ఎస్తేరు, రమాదేవి పాల్గొన్నారు.

బియ్యానికి పురుగులు పట్టకుండా చూసుకోండి :జేసీ

పెదవేగి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ బియ్యాన్ని పురుగులు పట్టకుండా భద్రపర్చాలని పౌర సరఫరాల శాఖాధికారులను జేసీ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. పెదవేగి మండలం వంగూరులోని సివిల్ సప్లై గోడౌన్‌ను జేసీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యానికి పురుగు పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఎల్ఎస్ పాయింట్లకు సూచించారు. జేసీ వెంట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి, పౌరసరఫరాల శాఖ మేనేజర్ ఉన్నారు. అనంతరం తాళ్లగూడెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్య, మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారాన్ని పరిశీలించారు.



గోతులు పూడ్పించిన టీడీపీ నేత

బుట్టాయగూడెం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కన్నాపురం - పులిరాముడుగూడెం గ్రామాల మధ్య మూలవేటు కాలువపై పడిన గోతులను మంగళవారం టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు పూడ్పించారు. కాలువపై పెద్దపెద్ద గోతులు పడటంతో పీఆర్ గూడెం, కొండరెడ్డి గ్రామాల ప్రజలు ప్రమాదాల భారీన పడుతున్నారు. విషయాన్ని గుర్తించిన టీడీపీ నాయకుడు గ్రామస్థులతో కలిసి గోతులను పూడ్పించారు. మడకం పాపాయమ్మ, సున్నం గౌతమ్, గెడ్డం సూర్యవివేక్, నాయక మధుసూదన్, మడకం దుర్గారావు, పులి శ్రీను, బట్టు ప్రవీణ్, షేక్ జాకీర్ పాల్గొన్నారు.

వైభవంగా షిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవం



మండవల్లి జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండవల్లిలోని దత్తపరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరం 15వ వార్షిక మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. పండితులు శ్రీచంగపల్లి రాజేష్‌శర్మ ఆధ్వర్యంలో బాబాకు పాలాభిషేకం, పూజలు చేశారు. శ్రీగణపతి హోమం, శ్రీగాయత్రీ హోమం, పూర్ణాహుతి పూజలు చేశారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ



ముదినేపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి):ముదినేపల్లి మండలంలో 3,362 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, షూలు, బెల్టులు, ఇతర స్టడీ మెటీరియల్స్‌ను పంపిణీ చేస్తున్నారు. మంగళవారం అల్లూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావూ నాగరాజు, ఎస్ఎంసీ చైర్మన్ వెంకట శ్యామల పంపిణీ చేశారు. హెచ్ఎం రామోజీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ మండల కమిటీల అబ్జర్వర్ల నియామకం

నూజివీడు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల కమిటీల ఎన్నికల నిర్వహణ కోసం ప్రతీ మండలానికి అబ్జర్వర్లను పార్టీ నియమించింది. వీరి సమక్షంలో పార్టీ విధించిన నిబంధనలు పాటిస్తూ ఎన్నికలు జరపాలి. ఏలూరు జిల్లాలో నూజివీడు, కైకలూరు, చింతలపూడి, పోలవరం, దెందులూరు, ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు ఏలూరు నగరంలో ప్రతీ మండలానికి ఒక అబ్జర్వర్‌ని నియమిస్తూ ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలకు ఉత్తర్వులు పంపారు. విశాఖలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం పూర్తయిన తరువాత 23వ తేదీ నుంచి ఈ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని పార్టీ నాయకులు నుంచి సమాచారం. నూజివీడు నియోజకవర్గంలో చాట్రాయి మండలానికి ఏలూరు డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావును అబ్జర్వర్‌గా నియమించారు. ఆగిరిపల్లి మండల అబ్జర్వర్‌గా ఏపీ శెట్టిబలిజ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ రామలింగేశ్వరరావు, ముసునూరు మండల అబ్జర్వర్‌గా భీమడోలు ఏఎంసీ చైర్మన్ ఎస్ శేషగిరి, నూజివీడు రూరల్ మండలం ఏపీ ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీజేఎస్ మాల్యాద్రి, నూజివీడు పట్టణ అబ్జర్వర్‌గా పెదవేగి మండల అధ్యక్షుడు బొప్పన సుధాకర్ నియమించబడ్డారు. కైకలూరు నియోజకవర్గంలో కలిదిండి మండల అబ్జర్వర్‌గా ఏలూరు ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, కైకలూరు మండల అబ్జర్వర్‌గా జగ్గవరపు ముత్తారెడ్డి, మండవల్లి అబ్జర్వర్‌గా పి. రామ్‌కుమార్, ముదినేపల్లి అబ్జర్వర్‌గా సూర్యచంద్రరావురెడ్డి నియమించబడ్డారు.

27న పోస్టల్ బీమా ఏజెంట్ల నియామక ఇంటర్వ్యూలు

ముదినేపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీలను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సేకరించేందుకు ఏజెంట్ల నియామకానికి ఈనెల 27న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని గుడివాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ముత్యాల శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏజెంట్ల నియామకానికి పదో తరగతి, పట్టణ ప్రాంతాల్లో నియామకానికి ఇంటర్మీడియట్ పాసైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ప్రాంతీయంగా పరిచయస్థులై ఉండి, ఇన్సూరెన్స్‌పై అవగాహన కలిగిన వారికి ప్రాధాన్యత ఇస్తామని, అభ్యర్థులు 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి కలిగిన అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల 27న ఉదయం 11 గంటలకు గుడివాడలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. బయోడేటాతోపాటు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్, పాన్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని రావాలని, ఎంపికైన అభ్యర్థులు రూ.5 వేలు సెక్యూరిటీ డిపాజిట్‌గా ఎన్ఎస్‌సీ, కేవీపీ బాండ్స్ రూపంలో పూచీకత్తు సమర్పించాలని తెలిపారు.



ప్రథమ స్థానం సాధించిన శోభనాపురం విద్యార్థులు

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో శోభనాపురం విద్యార్థులు ఫస్ట్

ఆగిరిపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): యోగా రోల్‌ప్లే రాష్ట్రస్థాయి పోటీల్లో శోభనాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. అంతర్జాతీయ 11వ యోగాంధ్ర దినోత్సవంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా, గుంటుపల్లిలో 16వ తేదీన నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగాంధ్ర పోటీల్లో శోభనాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు యోగా రోల్‌ప్లే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం సాధించారని హెచ్ఎం యామిని కృష్ణప్రియ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భార్గవి, మండల విద్యాశాఖ అధికారులు సర్వేశ్వరరావు, ఆనంద్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, పాఠశాల ఏఎంసీ చైర్మన్ దాసరి రాంప్రసాద్, యోగా ట్రైనర్ బొద్దూరి సాంబశివరావు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

కేన్సర్ రోగికి రూ.6 లక్షలు ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీతో రోగి కుమారుడు రఘు

చాట్రాయి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మగూడెం శివారు టి.గుడిపాడుకు చెందిన పత్రా జీవరత్నం పొట్ట కేన్సర్ బారిన పడి గుంటూరు సమీపంలోని పెదకాకాని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. జీవరత్నంది పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నాడు. టీడీపీ దళిత నాయకుడు బలుసూరి రత్తయ్య రోగి పరిస్థితిని మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి సారథి సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.6 లక్షలు ఎల్‌వోసీని రోగి జీవరత్నం కుమారుడు రఘుకు అందజేశారు. ప్రాణాపాయస్థితిలో ఆదుకున్న మంత్రికి జీవరత్నం కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

లోపూడి యువకుడికి డాక్టరేట్

ముసునూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): లోపూడి గ్రామానికి చెందిన యువకుడు మహ్మద్ సలీమ్ డాక్టరేట్ పట్టా పొందా రు. చెన్నైలోని సత్యభామ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి ఎలక్ట్రిక ల్ ఇంజినీరింగ్ రంగంలో ఈ యువ పరిశోధకుడు డాక్టరేట్ పట్టా వరించింది. లోపూడిలో నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు సలీమ్ ఎలక్ట్రికల్ పరిశోధనలో విశేష గుర్తింపు పొందడంపై స్థానికులు, కుటుంబసభ్యులు, స్నేహితులు మంగళవారం అభినందనలు తెలిపారు.

బీజేపీ నూజివీడు మండల కన్వీనర్‌గా నాగశివ



కన్వీనర్ నాగశివను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

నూజివీడు టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నూజివీడు మండల కన్వీనర్‌గా నక్కా నాగశివ, కో-కన్వీనర్‌గా నెక్కలపు కృష్ణారావు నియమితులయ్యారు. ప్రస్తుత మండల కమిటీ కాల పరిమితి ముగియడంతో నూతన కమిటీ నియామకం ఏర్పాటుకు జిల్లా పార్టీ కార్యాచరణ ప్రకటించింది. ముందుగా గ్రామస్థాయిలో బూత్ కమిటీల నిర్మాణానికి పార్టీ ముఖ్య నాయకులు తీర్మానం మేరకు నక్కా నాగశివ, నెక్కలపు కృష్ణారావులను నియామకానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్‌కిషోర్ ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు మంగళవారం నూజివీడులో జరిగిన సమావేశంలో నాగశివకు కన్వీనర్‌గా బాధ్యతలను అప్పగించారు. పార్టీ పరిశీలకుడు బోసు అప్పారావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.రాజశేఖర్, నూజివీడు అసెంబ్లీ ఇన్‌చార్జి మాటూరి రవికాంత్, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.పుల్లారావు పాల్గొన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు లావు కుటుంబరావు చౌదరి, నూజివీడు మండల అధ్యక్షుడు నక్కా శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు నెక్కలపు కృష్ణారావు, మరీదు శ్రీకాంత్, ఎల్.మణిరత్నం, తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

తల్లికి ఆనందం

- 'తల్లికి వందనం' పేరుతో తల్లుల ఖాతాల్లో నగదు జమ
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, ఎమ్మెల్యే కామినేని చిత్ర పటాలకు క్షీరాభిషేకం



కొండంగిలో సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే కామినేని చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న తల్లులు

కలిదిండి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పేరిట తల్లుల ఖాతాల్లో నగదు జమ కావడంతో విద్యార్థుల తల్లులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కన్వీనర్ నల్లగోపుల చలపతిరావు ఆధ్వర్యంలో కొండంగిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చిత్రపటాలకు విద్యార్థుల తల్లులు క్షీరాభిషేకం చేశారు. కూటమి ప్రభుత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ ప్రెసిడెంట్ పొన్నాల లక్ష్మణరావు, కొండంగి సర్పంచ్ తిరుమలశెట్టి జ్యోతి, నాయకులు కొల్లాటి సుబ్బారావు, టి.పోతురాజు, ఎస్.లీలాకుమార్, కె.ప్రసాద్, పన్నా కృష్ణ, టి.లక్ష్మణరావు, కొల్లాటి నాగలక్ష్మి, తిరుమలశెట్టి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విశ్వనాద్రిపాలెంలో ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం అందుకున్న కుటుంబం

తల్లికి వందనంతో ఆనందం

ముదినేపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఓ కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం పథకం వర్తింప చేస్తామన్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చింది. ముదినేపల్లి మండలం పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెం గ్రామానికి చెందిన సాయిల శ్రీనివాసరావు, గోపీకుమారి కుటుంబంలోని ముగ్గురు పిల్లలకు రూ.39 వేలు బ్యాంక్ ఖాతాలో జమ అయింది. తమ పిల్లలకు మంచి చదువులు చెప్పించగలమన్న నమ్మకం ఏర్పడిందని వారు సంతోషం వ్యక్తం చేశారు.

'తల్లికి వందనం'పై జాయింట్ ఎల్‌పీల దెబ్బ

ఉన్నది 50 సెంట్లు.. వెబ్ ల్యాండ్‌లో 27 ఎకరాలు

ముదినేపల్లి : భూముల రీసర్వేలో జరిగిన పొరపాట్లు తల్లికి వందనం పథకానికి కూడా వెంటాడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఈ రీసర్వేలో నమోదైన జాయింట్ ఎల్‌పీల సమస్య పరిష్కారం కాకపోవడంతో ముదినేపల్లి మండలంలో అర్హులైన పలు కుటుంబాలకు తల్లికి వందనం సొమ్ము అందలేదు. ముదినేపల్లికి చెందిన బోయిన తాతయ్యకు మండవల్లి మండలం లింగాలలో 50 సెంట్లు పొలం ఉండగా, రీ సర్వేలో జరిగిన పొరపాట్లతో జాయింట్ ఎల్‌పీ కారణంగా వెబ్ ల్యాండింగ్‌లో 27 ఎకరాల భూమి ఉన్నట్టు చూపిస్తున్నది. సబ్ డివిజన్ చేసి తన భూమికి ప్రత్యేకంగా ఎల్‌పీ నంబర్ ఇవ్వాలని తాతయ్య రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో ఇద్దరు పిల్లలు కలిగి ఉన్న తాతయ్య కుటుంబం ఇప్పుడు తల్లికి వందనం సొమ్ము అందుకోలేకపోయారు. ఇప్పట్లో ఆ సమస్య పరిష్కారం కాదు కాబట్టి ఈ ఏడాదికి ఈ పథకం లబ్ధిని పొందే అవకాశం లేదు. ఈవిధంగా ఎంతో మంది ముదినేపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన మహిళలు తమకు 20 నుంచి 30 సెంట్లు పొలం ఉంటే వెబ్ ల్యాండ్‌లో మూడు ఎకరాలకు పైగా పొలం చూపిస్తున్నదని, డ్రోన్ రీ సర్వే తప్పిదాల వల్ల నమోదైన జాయింట్ ఎల్‌పీలే కారణమని ఈ సమస్యను పరిష్కరించాలని రెండు రోజులుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కారు లేకున్నా, నాలుగు చక్రాల కారు ఉన్నట్లు, అతి పేద కుటుంబానికి 300 యూనిట్లకు మించి విద్యుత్ బిల్లులు వస్తున్నట్టు చూపించి అర్హులైన వారిని కూడా అనర్హుల జాబితాల్లో చేర్చారు. జాయింట్ ఎల్‌పీల సమస్యను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పరిష్కరించకపోతే ఈ ఏడాది తల్లికి వందనం అందదేమోనని పలువురు ఆందోళన చెందుతున్నారు.



విజయ దరహాసంతో పారా స్విమ్మర్ గణేష్

ఇంగ్లీష్ చానెల్‌ను ఈదిన ఏలూరు శాప్ కోచ్ గణేష్

ఏలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఏపీకి చెందిన పారా స్విమ్మర్ బలగ గణేష్ ఇంగ్లీష్ ఛానెల్‌ను ఈది అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. స్విమ్మింగ్‌లో సత్తా చాటుతూ ఇప్పటికే పలు పతకాలను సాధించిన ఏలూరు శాప్ కోచ్, సీనియర్ పారా స్విమ్మర్ బలగ గణేష్ ఆదివారం ఇంగ్లీష్ ఛానల్‌ను ఈది అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. లండన్ నుంచి ఫ్రాన్స్ వరకు 33 కిలోమీటర్లు మేర 13 గంటల 37 సెకన్ల పాటు ఇంగ్లీష్ చానెల్ ఈది సత్తా చాటాడు. ఆంధ్రప్రదేశ్ ట్రూప్‌లో నలుగురి బరిలో దిగగా గణేష్ లక్ష్యాన్ని చేరుకున్నాడు. గత నెలలో పాక్ జలసంధిని గణేష్ అలవోకగా ఈదాడు

చదువుకున్న స్కూల్లోనే టీచర్లుగా విధులు



హెచ్ఎంతో సహోపాధ్యాయినులు

ముదినేపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చదువుకున్న పాఠశాలలోనే ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించడంలో సంతృప్తి, మంచి అనుభూతి ఉంటుంది. చదువు నేర్చుకున్న పాఠశాలకే ఉపాధ్యా యులుగా చేరడంతో పాటు తమకు చదువు చెప్పిన మాస్టారు వద్ద సహోపాధ్యాయులుగా చేయడం విశేషంగా చెప్పవచ్చు. అటువంటి అనుభూతి కలిగించే పరిస్థితి ప్రస్తుతం ముదినేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగింది. ఈ హైస్కూలు పూర్వపు విద్యార్థినులే ప్రస్తుతం ఉపాధ్యాయినులుగా విధుల్లో ఉన్నారు. 1999లో ఈహైస్కూల్లో పదో తరగతి పాసైన ముదినేపల్లికి చెందిన నసీరా బేగం, కేదారు పద్మావతి టీచర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత హెచ్ఎం విజయకుమార్ అప్పట్లో సోషల్ టీచరుగా ఉండేవారు. ఒకే బ్యాచ్‌లో టెన్త్ పాసైన వారిరువురూ తిరిగి ఒకేసారి ఒకే హైస్కూల్లో టీచర్లుగా కలవడం వారికి ఆనందం కలిగించిందన్నారు.



వెండి దార పాత్రను అందిస్తున్న పండుబాబు, వాణీశ్రీ దంపతులు

రూ.లక్ష విలువైన వెండి దార పాత్ర బహూకరణ

పెదవేగి, జూన్ 17(ఆంధ్రజ్యోతి):ముసునూరు మండలం బలివే శ్రీరామలింగేశ్వరస్వామికి హైదరాబాద్‌కు చెందిన యలమంచిలి పండుబాబు, వాణీశ్రీ దంపతులు రూ.లక్ష విలువైన వెండి దార పాత్రను బహూకరించారు. స్వామిని దర్శించుకున్న దాతలు పూజలు నిర్వహించి, వెండి దార పాత్రను ఆలయ అర్చకుడు భాస్కరరావుకు మంగళవారం అందించారు. దాత పండుబాబు మాట్లాడుతూ మా ఇష్టదైవమైన రామలింగేశ్వర స్వామి వద్ద మొక్కును చెల్లించుకోవడానికి వచ్చామన్నారు. ఆలయ మాజీ చైర్మన్ ఎం.ఘంటేశ్వరరావు, టీడీపీ విజయరాయి క్లస్టర్ ఇన్‌చార్జ్ మంచినేని శ్రీనివాసరావు, అబ్బినేని రాంబాబు, ఎం.వంశీ పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతత అలవర్చుకోవాలి

కలిదిండి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మానసిక రోగం నుంచి బయట పడాలంటే మానసిక ప్రశాంతతను అలవర్చుకోవాలని జిల్లా ప్రభుత్వాసుపత్రి సైకాలజిస్ట్ శ్రీనివాస రావు అన్నారు. మంగళవారం కలిదిండి, కోరుకొల్లు పీహెచ్‌సీల్లో జిల్లా మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్‌లో భాగంగా మెంటల్ హెల్త్ క్లినిక్ నిర్వహించారు. 20 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేశారు. అనంతరం మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్‌పై అవగాహన కల్పించారు. మానసిక వ్యాధిగ్రస్తులను గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. హెచ్‌డబ్ల్యూసీ నోడల్ అధికారి డాక్టర్ ఆర్. రోహిత్, సైకియాట్రిస్ట్ కోమలి, కోరుకొల్లు, కలిదిండి పీహెచ్‌సీ వైద్యాధికారులు జాహ్నవి, హేమంత్, ధీరజ్ కుమార్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉచిత సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

ముసునూరు, జూన్ 17 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వం దివ్యాంగులకు అందిస్తున్న ఉచిత సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రశాంతి అన్నారు. మంగళవారం రమణక్కపేట మెయిన్ పాఠశాలలో ఉన్న భవిత సెంటర్‌లో ఉచిత ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పది మంది పిల్లలకు డాక్టర్ ప్రశాంతి చికిత్సను అందించి వారిపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిబిరంలో ఐఈఆర్పీలు లక్ష్మీనారాయణరావు, నాగమల్లేశ్వరి, తల్లిదండ్రులు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులకు వినతి ఇస్తున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



కొల్లేరు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు



పందిరిపల్లిగూడెంలో సీఈసీ కమిటీకి వినతిపత్రాలు అందజేస్తున్న సీపీఎం నాయకులు

మమ్మల్ని బతకనివ్వండి

(5వ పేజీ తరువాయి)

మంగళవారం మధ్యాహ్నం ఏలూరు చేరుకున్న బృందం కొల్లేరు వెళ్లింది. అటవీ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంట రాగా అన్ని అంశాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. కొల్లేరు వాసులు కష్ట, సుఖాలను ప్రస్తా విస్తూ తమ వినతులను కమిటీకి అందజేశారు. కొల్లేటికోటలో ఏర్పాటు చేసిన భేటీలో సమస్యలను ఏకరవు పెట్టారు. ఓ వైపు కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుతోపాటు ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, మాజీ ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ తదితరులు కొల్లేరు స్థితిగతులను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. కొల్లేరు పరీ వాహకంలో మూడు లక్షల మందికిపైగా జీవిస్తు న్నామని, ఈ ప్రాంత పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూనే సమాంతరంగా తమ జీవన స్థితిగతులను పరిగణనలోకి తీసుకోవాలని అత్యధికులు తమ వినతుల్లో కమిటీకి నివేదించారు. జిరాయితీ, డి-ఫారం పట్టా భూములను తమకు పంచే విషయంలో ఒకింత సానుకూలత చూపాలని అభ్యర్థించారు. కొల్లేరు ప్రాంతంలో 122గ్రామాలున్నాయని, ఈ ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణి సంరక్షణకు జాగ్రత్తలు తీసుకుంటునే ఉన్నామని కలెక్టర్ వెట్రిసెల్వి కమిటి దృష్టికి తీసుకెళ్లారు.

పర్యటన సాగింది ఇలా..

కమిటి తొలిరోజు శ్రీపర్రు, కలకుర్రు, అటపాక, కొల్లేటికోట, పైడిచింతపాడు, ప్రత్తికోళ్లలంక. గుడివాకలంక, మొండికోడు, చాటపర్రు ప్రాంతాల మీదుగా పర్యటిస్తున్నప్పుడు స్థానికులు స్వాగతం పలికి వినతులను సమర్పించారు. అంతకుముందు ఏలూరు చేరుకున్న కమిటి సభ్యులు చంద్రశేఖర్ గోయల్, డాక్టర్ జేఆర్ భట్, జి.భానుమతి, సునీల్ లిమాయే, ప్రకాశ్‌చంద్రభట్‌తోపాటు అటవీ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంత రాముకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్వాగతం పలికారు. కమిటీ వెంట ఎస్పీ కిశోర్, ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ అజయ్‌కుమార్‌నాయక్, మత్స్యశాఖ కమిషనర్ రమాశంకర్ నాయక్, పశ్చిమ జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి, డీఎఫ్‌వోలు శుభం, విజయ, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ ఉన్నారు.

వినతుల వెల్లువ

పెనుమాకలంక, ఇంగిలిపాకలంక, మణుగులూరు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేశారు. అటపాక పక్షుల కేంద్రంలో కొల్లేరు మ్యాప్‌ను పరిశీలించారు. సరస్సు ఉనికి, ఏయే దేశాల నుంచి పక్షులు వలస వస్తున్నాయి, పర్యాటక వసతులు, తదితర వివరాలను అటవీ శాఖ అధికారులు సీఈసీ కమిటీకి వివరించారు. కైకలూరు మండలం పందిరిపల్లిగూడెంలో సుమారు 10 వేల మంది కొల్లేటివాసులతో సీఈసీ కమిటీ మమేకమైంది. ప్రధానంగా మంచినీటి చెరువులు, పశువుల చెరువులు, ఇళ్ల స్థలాలు, వాటిని మెరక చేయడం, శ్మశాన వాటికలు, రహదారులపై అన్ని గ్రామాల నుంచి అర్జీల రూపంలో ప్రజలు తమ డిమాండ్లను ఎక్కువగా వినిపించారు. సీపీఎం, సీపీఐ నాయకులు కొల్లేరు సమస్యను పరిష్కరించాలని రాత పూర్వకంగా అర్జీలను కమిటీ సభ్యులకు అందించారు. కొల్లేరు అభయారణ్య పరిధిలో పక్షులకు ఎలాంటి హాని కలిగించబోమని సమావేశానికి హాజరైన ప్రజలతో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు భగవంతుని సాక్షిగా ప్రమాణం చేయించారు.

అనంతరం సాధికార కమిటీ సభ్యులు రాత్రి ఏలూరు కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరానికి కమిటీ చేరుకుని వినతులను స్వీకరించారు. దెందులూరు, ఏలూరు, ఉంగుటూ రు ప్రాంతాల రైతులు, కొల్లేరు వాసులు, పర్యావరణవేత్తలు తమ అభిప్రాయాలతో కమిటీకి వినతులను అందించారు. కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ గోయల్‌కు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తోపాటు ఆయన కుమార్తె నవ్యశ్రీ కొల్లేరు సమస్యలపై వినతులు సమర్పించారు. కమిటీ బుధవారం ఉంగుటూరు నియోజకవర్గంలో పర్యటిస్తుంది. ఆ తదుపరి కలెక్టరేట్‌లో ప్రత్యేక సమీక్ష సమావేశానికి హాజరు కానుంది.



వైవీఎన్నార్ డిగ్రీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

యోగాతో మనిషి జీవనశైలిలో మార్పు

కైకలూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): యోగా అనేది వ్యాయామమే కాదని ప్రతీ మనిషి జీవనశైలిలో అనేక మార్పులను తీసుకువస్తుందని ప్రిన్సిపాల్ వై.శ్రీలత అన్నారు. మంగళవారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.శివనాగరాజు విద్యార్థులచే ప్రాణాయామాలు, యోగాసనాలు నేర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగా సాధనతో శరీర ధృఢత్వాన్ని, శ్వాస నియంత్రణ మెరుగుపడుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.విజయకుమార్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

'మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతాం'



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ జయరాజు

చాట్రాయి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అవసరమైన ప్రోత్సాహకాలు అందించి మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఏలూరు జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ విజయరాజు అన్నారు. చాట్రాయి సచివాలయంలో మంగళవారం స్వయం సహాయక సంఘాల మహిళల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగు సిబ్బంది స్వయం సహాయ సంఘాల సభ్యులైన మహిళలు అందరి వేలిముద్రలు తీసుకుని, వారు గతంలో ఎటువంటి రుణాలు తీసుకున్నారు, చేస్తున్న వ్యాపారం, ఇంకా ఎంత రుణం అవసరం మొదలైన వివరాలు సేకరించి, లోన్ రిక్వెస్ట్ పెడతారని దీనిని మహిళలు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్‌హెచ్‌జీ మహిళల ఆర్థికాభివృద్ధికి బ్యాంకు లింకేజి, స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్, అంతర్గత అప్పులు, పీఎంఈజీపీ, పీఎం ఎఫ్ఎంఈ మొదలైన పథకాల ద్వారా రుణాలు అందజేస్తున్నట్టు చెప్పారు. తీసుకున్న రుణాలు సకాలంలో సక్రమంగా చెల్లించడం ద్వారా ఆయా ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు బ్యాంకుల వద్ద పరపతి పెరిగి ఇంకా ఎక్కువ రుణాలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. విస్సన్నపేట వెలుగు అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ సుందరరావు, ఏపీఎం వెంకటేశ్వరరావు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయిన్లలో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలి

చాట్రాయి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఇళ్లల్లోని చెత్త చెదారం డ్రెయిన్లలో వేయకుండా ప్రజలు సహకరించాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ దుర్గాప్రసాద్ కోరారు. మండలంలోని చిన్నంపేట, చీపురుగూడెం గ్రామాల్లో వైద్యాధికారుల పర్యవేక్షణలో మంగళవారం దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం మొదలైనందున డ్రెయిన్లు, నీటి నిల్వ కుంటలలో దోమలు వృద్ధి చెందుతాయని, ఇంటిలోని ఫ్రిజ్‌లు, కూలర్ల వెనుక భాగంలో ఉండే నీటిని వారానికి ఒకసారి తీసేయడం వల్ల దోమలు తగ్గి డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. సర్పంచ్‌లు పరసా ధనలక్ష్మి, ఓబిళ్ళనేని సరోజిని, పంచాయతీ కార్యదర్శి పార్థసారథి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులందరూ గుర్తింపు కార్డులు పొందాలి

ముదినేపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులందరూ గుర్తింపు కార్డులు తీసుకోవాలని, వీఆర్‌వోలకు దరఖాస్తు చేసి కార్డులు పొందా లని మండవల్లి ఏడీఏ జి.వెంకటమణి సూచిం చారు. సింగరాయపాలెంలో వ్యవసాయశాఖ మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుర్తింపు కార్డులు ఉన్న కౌలు రైతులకే బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు, ఇతర ప్రయోజనాలు వర్తిస్తాయన్నారు. ఈనెల 20లోగా రైతులు ఈకేవైసీ చేయించుకుని అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిపొందాలని కోరారు. సార్వాలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను ఏవో వేణుమాధవ్ సూచించారు. సర్పంచ్ బోయిన విమలతో పాటు రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
నూజివీడు : 99854 02464
కైకలూరు : 99854 11868

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234